పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 | సంచిక : 718 | పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు | ఎడిటర్ : ఎస్. మస్తాన్ | బుధవారం 16.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

## పేదలందరికీ సొంతింటి ధీమా

# 2029 నాటికి పూర్తి: చంద్రబాబు

**2027 మార్చి నాటికి 5.52 లక్షల గృహాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశం**



- ఉచిత ఇళ్ల స్థలాల కోసం పారదర్శక విధానం అమలు చేయాలని సూచన
- కేంద్ర సహకారంతో రాష్ట్రంలో పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక
- కుప్పం నియోజకవర్గంలో సంతృప్త స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్దేశం

2లో



తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాల వేళ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు సతీసమేతంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా బేడీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్న సీఎం, అనంతరం మంగళవాయిద్యాల నడుమ పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు సీఎం కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర సహా పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## పరస్పర సున్నితత్వం పాటించాలి

# జిన్‌పింగ్‌తో మోదీ స్పష్టం

- భారత్ ఆందోళనలను జిన్‌పింగ్ దృష్టికి తీసుకెళ్లిన ప్రధానమంత్రి
- శత్రువులుగా కాదు, భాగస్వాములుగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చైనా వెల్లడి



ఢిల్లీ : న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు పరస్పరం ఆందోళనలను అర్థం చేసుకుని, సున్నితత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించినట్లు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ భేటీకి సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియాకు వివరించారు. "పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనం, పరస్పర సున్నితత్వం" అనే మూడు ప్రధాన సూత్రాల ప్రాతిపదికన ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు సాగాలని ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడికి తరువాయి 2లో

## ఏఐకి ఇంకా సిద్ధం కాలేదు

# బిల్ గేట్స్ హెచ్చరిక

- ఏఐ వృద్ధి నియంత్రణ అవసరమని పిలుపునిచ్చిన బిల్ గేట్స్
- ఇంతటి భారీ మార్పుకు మనం సిద్ధంగా లేమని వ్యాఖ్య
- సైబర్ దాడుల ముప్పు పొంచి ఉందని హెచ్చరిక
- ఏఐపై ఆందోళన వ్యక్తం చేసిన ఎలాన్ మస్క్, శామ్ ఆల్ట్‌మన్
- సమానత్వం కోసం ఏఐపై 1 బిలియన్ డాలర్లు కేటాయించిన గేట్స్ ఫౌండేషన్



2లో



## హసీనా రీఎంట్రీ వేళ షాక్

# 7 గురు నేతలకు మరణశిక్ష

- డిసెంబర్ నాటికి బంగ్లాదేశ్ వస్తానని ప్రకటించిన షేక్ హసీనా
- ఇప్పటికే హసీనాకు ఉరిశిక్ష విధించిన ట్రైబ్యునల్
- అవామీ లీగ్ నేతలకు ఉరిశిక్ష విధించిన అదే ట్రైబ్యునల్

బంగ్లాదేశ్ రాజకీయంలో మరోసారి సంచలనాత్మక పరిణామాలు చోటు చేసుకున్నాయి. దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా వచ్చే డిసెంబర్‌లో భారత్ నుంచి తిరిగి బంగ్లాదేశ్‌కు వెళ్లనున్నట్లు ప్రకటించిన తరువాయి 2లో




## భారత విద్యార్థులకు ఊరట

# ట్రంప్ నిర్ణయంపై కోర్టు స్టేప్పు

- నాలుగేళ్ల విద్యార్థి వీసా పరిమితిపై అమెరికా కోర్టు స్టే
- ట్రంప్ ప్రభుత్వ నిబంధన అమలును తాత్కాలికంగా అడ్డుకున్న న్యాయమూర్తి
- కొత్త నిబంధన అమల్లోకి వస్తే నాలుగేళ్లు దాటితే అనుమతి తీసుకోవాల్సి వచ్చేది
- పీహెచ్‌డీ విద్యార్థులపై ప్రభావం ఎక్కువగా ఉండేది
- నిబంధనను ప్రభుత్వం అప్పీల్ చేసే అవకాశం

2లో

## ప్రైవేట్ కోచింగ్‌పై

# చంద్రబాబు కొరడా

- ప్రభుత్వంపై బురద జల్లేందుకు అభ్యర్థులను రెచ్చగొడుతున్నాయని కోచింగ్ సెంటర్లపై ఆరోపణ
- రాజకీయ ప్రయోజనాల కోసమేనని ప్రభుత్వ నిర్ధారణ
- జీవో నెం.9 నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని వెల్లడి
- రాజకీయ కుట్రల్లో భాగస్వాములను చేస్తే సహించేది లేదని స్పష్టీకరణ



2లో

## భారత్ 'కృత్రిమ సూర్యుడు'

# విజయవంతమైతే అపార లాభాలు

- గుజరాత్‌లోని ఎస్ఎస్‌టీ-1 టోకామాక్‌లో కొత్త హీటింగ్ సిస్టమ్ ఏర్పాటు
- అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద ప్లాస్మాను నియంత్రించేందుకు గైరోట్రాన్ వ్యవస్థ
- సూర్యుడి కేంద్రకం కన్నా అధిక ఉష్ణోగ్రతలను సాధించిన భారత ప్రయోగాలు
- అపరిమిత శక్తినిచ్చే ఫ్యూజన్ టెక్నాలజీపై పరిశోధనలు వేగవంతం



2లో

## త్వరలో ఎఫ్.టి.పి.సి. ఇండియా మరియు ఈగిల్ పరస్పర సహకారంతో

# డ్రగ్ ఫ్రీ ఇండియా షార్ట్ ఫిలిం కాంటెస్ట్

* **సామాజిక బాధ్యతతో ముందుకు రావడం ప్రసంశనీయం.**
* **ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఈగిల్, ఎ.పి. ఆకే రవి కృష్ణ**

ఎఫ్.టి.పి.సి. ఇండియా (ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) మరియు ఈగిల్ పరస్పర సహకారంతో డ్రగ్ ఫ్రీ ఇండియా షార్ట్ ఫిలిం కాంటెస్ట్ కు సూచన ప్రాయంగా ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఈగిల్, ఎ.పి. ఆకే రవి కృష్ణ మరియు ఈగిల్, ఎ.పి. సూపరింటెండెంట్ శ్రీమతి జి. స్వరూప రాణి అంగీకారం తెలిపారు. మంగళవారం నాడు ఆఫీస్ కార్యాలయం లో సినిమా, టెలివిజన్ మరియు డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల





అభివృద్ధికి కృషి చేస్తున్నఎఫ్.టి.పి.సి. ఇండియా ప్రతిపాదనతో ముందుకు రావడం ఎంతో అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వం మరియు ఈగిల్ చేస్తున్న కృషిని గుర్తించి ఎఫ్.టి.పి.సి. ఇండియా వారు ముందుకు రావడం ఎంతో ప్రశంసనీయమని జాతీయ అధ్యక్షులు చైతన్య జంగా మరియు జనరల్ సెక్రటరీ పి.వి.ఎస్. వర్మ ను అభినందించారు. డ్రగ్స్ వినియోగం వల్ల యువత, కుటుంబాలు మరియు సమాజంపై పడుతున్న ప్రతికూల ప్రభావాలను ప్రజలకు తెలియజేయడం, ముఖ్యంగా యువతలో అవగాహన పెంచడం, డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా ప్రోత్సహించడం ఈ షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ ప్రధాన ఉద్దేశ్యం అని అధ్యక్ష కార్యదర్శిలు చైతన్య జంగా మరియు పి.వి.ఎస్. వర్మ తెలిపారు. ఈ పోటీలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన, యువత భవిష్యత్తు, కుటుంబ విలువలు, సామాజిక బాధ్యత, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, డ్రగ్‌ఫ్రీ సమాజ నిర్మాణం వంటి అంశాలపై షార్ట్ ఫిల్మ్స్ నిర్మించే వాళ్ళు హెల్ప్ లైన్ నంబర్ల నందు 9866333787 , 9848669996 సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమానికి ఈగిల్ కార్యక్రమంతో అనుసంధానం ద్వారా డ్రగ్స్ వ్యతిరేక సామాజిక అవగాహనను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఎఫ్.టి.పి.సి. ఇండియా ముందుకు సాగుతోంది. త్వరలో షార్ట్ ఫిలిం కాంటెస్ట్ పూర్తి వివరాలను తెలియ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో విజయ స్కూల్ నర్సింగ్ చైర్మన్ టి. అర్జున్ రావు, డా. చల్ల హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పరస్పర సున్నితత్వం పాటించాలి

## జిన్‌పింగ్‌తో మోదీ స్పష్టం

న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు పరస్పరం ఆందోళనలను అర్థం చేసుకుని, సున్నితత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించినట్లు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ భేటీకి సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియాకు వివరించారు. "పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనం, పరస్పర సున్నితత్వం" అనే మూడు ప్రధాన సూత్రాల ప్రాతిపదికన ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు సాగాలని ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడికి స్పష్టం చేశారని ఆయన తెలిపారు. భారత్‌కు ఉన్న కీలక ఆందోళనలను కూడా ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించినట్లు జైస్వాల్ పేర్కొన్నారు. మరోవైపు, ఈ సమావేశంపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పందిస్తూ, ఇరు దేశాలు పరస్పరం శత్రువులు కాదని, భాగస్వాములుగా కొనసాగాలనే ఏకాభిప్రాయానికి వచ్చాయని తెలిపారు. ఈ భేటీలో కుదిరిన అత్యంత కీలకమైన అంశం ఇదేనని ఆయన అభివర్ణించారు. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతలను కాపాడేందుకు ఇరువురు నేతలు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. భారత్.. చైనాకు శత్రువు కాదని, ఒక భాగస్వామి అని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు చైనా మీడియా కథనాలు వెల్లడించాయి. చైనాతో తమ విధానం ఏ ఇతర దేశం ప్రభావంతోనూ ముడిపడి ఉండదని మోదీ స్పష్టం చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. కాగా, 2027లో బ్రిక్స్ కూటమికి చైనా అధ్యక్షత వహించనుంది.

### ఏఐకి ఇంకా సిద్ధం కాలేదు

## బిల్ గేట్స్ హెచ్చరిక

టెక్నాలజీ రంగంలో ఎల్లప్పుడూ అగ్రగామిగా నిలిచే మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అభివృద్ధిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఏఐ' పురోగతి వేగాన్ని కొంతమేర తగ్గించాల్సిన అవసరం ఉందని, ఈ సాంకేతికత తీసుకురాబోయే భారీ మార్పులను ఎదుర్కొనేందుకు ప్రపంచం ఇంకా సిద్ధంగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక అంశాలను పంచుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది గతంలోని పర్సనల్ కంప్యూటర్లు లేదా ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణల కంటే భిన్నమైనదని, ఇది సమాజంలో లోతైన మార్పులకు కారణమవుతుందని బిల్ గేట్స్ వివరించారు. "ఇంత వేగవంతమైన, విస్తృతమైన మార్పులకు మనం ఇంకా సంసిద్ధం కాలేదు. నిరంతరం ఆవిష్కరణలను ప్రోత్సహించే నేనే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యంగా అనిపించవచ్చు" అని ఆయన పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో ఏఐ ఆధారిత సైబర్ దాడుల రూపంలో పెను ముప్పు పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలోనే, స్వయంప్రతిపత్తి కలిగిన ఏఐ మోడల్స్ నియంత్రణ కోల్పోయినట్లు వార్తలు వచ్చిన 'హగ్గింగ్ ఫేస్ ఘటన'ను ఆయన ప్రస్తావించారు. ఇటీవల టెస్లా అధినేత ఎలాన్ మస్క్, ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ వంటి టెక్ దిగ్గజాలు సైతం ఏఐ అభివృద్ధి వేగం పట్ల ఇటువంటి ఆందోళనలనే వ్యక్తం చేశారు. ఇప్పుడు బిల్ గేట్స్ కూడా వారి వాదనతో ఏకీభవించడం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు, ఏఐ వల్ల అనేక ప్రయోజనాలు కూడా ఉన్నాయని గేట్స్ ఫౌండేషన్ విశ్వసిస్తోంది. తమ 'గోల్‌కీపర్స్ రిపోర్ట్'లో పేర్కొన్నట్లుగా, ఏఐని సరైన మార్గంలో నడిపిస్తే, అది సామాజిక సమానత్వాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనంగా మారుతుందని వెల్లడించింది. ఈ దిశగా, సమానత్వంతో కూడిన ఏఐ అభివృద్ధి కోసం తమ ఫౌండేషన్ 1 బిలియన్ డాలర్లను కేటాయించినట్లు స్పష్టం చేసింది.

### హసీనా రీఎంట్రీ వేళ షాక్..

## 7 గురు నేతలకు మరణశిక్ష

బంగ్లాదేశ్ రాజకీయంలో మరోసారి సంచలనాత్మక పరిణామాలు చోటుచేసుకు న్నాయి. దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా వచ్చే డిసెంబర్‌లో భారత్ నుంచి తిరిగి బంగ్లాదేశ్‌కు వెళ్లనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో, అవామీ లీగ్ పక్షానికి అక్కడి అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ భారీ షాక్ ఇచ్చింది. 2024లో చోటుచేసుకున్న విద్యార్థుల పోరాటం, ఉద్యమ అణచివేత కేసులో మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై అవామీ లీగ్ జనరల్ సెక్రటరీ ఒబైదుల్ ఖాదర్‌తో సహా ఏడుగురు సీనియర్ నాయకులకు మరణశిక్ష ఖరారు చేస్తూ జస్టిస్ నజ్రుల్ ఇస్లామ్ చౌదరి నేతృత్వంలోని ట్రైబ్యునల్ మంగళవారం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది.

**ఉరిశిక్ష పడిన నేతలు:**

* ఒబైదుల్ ఖాదర్: ఆవామీ లీగ్ జనరల్ సెక్రటరీ & మాజీ మంత్రి
* బహావుద్దీన్ నసీమ్: జాయింట్ జనరల్ సెక్రటరీ
* మహ్మద్ అలీ అరాఫత్: మాజీ సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి
* షేఖ్ ఫజల్ షమ్స్ పరాష్, మైనుల్ హుస్సేన్ ఖాన్ నిఖిల్: జుబో లీగ్ నేతలు
* సద్దాం హుస్సేన్: ఛాత్ర లీగ్ అధ్యక్షుడు

షేక్ వలీ ఆసిఫ్: ఛాత్ర లీగ్ జనరల్ సెక్రటరీ

2024 జూలైఆగస్టు నెలల్లో దేశంలో హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన విద్యార్థుల ఉద్యమంపై విచక్షణారహితంగా దాడులు చేయించడం, హత్యలకు పురికొల్పడం, ప్రేరేపించడం వంటి తీవ్రమైన ఆరోపణలు రుజువు కావడంతో ఈ శిక్షలు విధించారు.

## పేదలందరికీ సొంతింటి ధీమా.. 2029 నాటికి పూర్తి: చంద్రబాబు

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన గృహాన్ని అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని సాచురేషన్ విధానంలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు ఆ శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్), పీఎం జన్ మన్ వంటి వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణ పనులను వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో 1.5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. డిసెంబరు 2026 నాటికి 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారుల గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పీఎంఏవై 1.0, 2.0, పీఎం జన్ మన్ పథకాల కింద మొత్తం 18.72 లక్షల ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 13.20 లక్షలు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో 16.11 లక్షల ఇళ్లకు గాను 11.31 లక్షలు, ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గాను 1.88 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు.



**ఉచిత ఇళ్ల స్థలాలపై ప్రత్యేక కార్యాచరణ**

ఇంటి స్థలం లేని అర్హులైన కుటుంబాలను కచ్చితంగా గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖలతో పాటు ఆర్టీజీఎస్ నుంచి డేటాను అనుసంధానం చేసి, డూప్లికేషన్ లేకుండా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రాథమిక జాబితాలు ప్రచురించి, అభ్యంతరాలు స్వీకరించి, పారదర్శకంగా పరిష్కరించిన తర్వాతే తుది జాబితాలను ఖరారు చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టని భూమిని అవసరాన్ని బట్టి 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని నిర్దేశించారు. కుప్పం నియోజకవర్గంలో సాచురేషన్ విధానంలో గృహ నిర్మాణం చేపట్టాలని ప్రత్యేకంగా ఆదేశించారు.

* **పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక**

రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పారిశ్రామిక టౌన్‌షిప్‌లను నిర్మించే అంశంపై దృష్టిసారించాలని ముఖ్యమంత్రి గృహ నిర్మాణ శాఖను ఆదేశించారు. శ్రీసిటీ సహా ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ టౌన్‌షిప్‌ల ఏర్పాటు ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)తో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. 2027 డిసెంబరు నాటికి మరో 75 వేల కొత్త గృహాలు మంజూరయ్యేలా, 1.5 లక్షల ఇళ్లను పైప్‌లైన్‌లో ఉంచేలా చూడాలని, ఇందుకు అవసరమైన నిధుల కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

## భారత విద్యార్థులకు ఊరట.. ట్రంప్ నిర్ణయంపై కోర్టు స్టేప్ప

అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థులకు భారీ ఊరట లభించింది. అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను నాలుగేళ్లకే పరిమితం చేస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధన అమలును ఫెడరల్ కోర్టు తాత్కాలికంగా అడ్డుకుంది. ఈ నిర్ణయంతో అమెరికాలో చదువుతున్న వేలాది మంది భారతీయ విద్యార్థులకు కూడా ప్రయోజనం కలగనుంది. బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి ఎఫ్. డెన్నిస్ సేలర్ సోమవారం దేశవ్యాప్తంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త నిబంధన మంగళవారం నుంచి అమల్లోకి రావాల్సి ఉండగా ఈ ఆదేశాలు వచ్చాయి. ఇప్పటివరకు విదేశీ విద్యార్థులు తమ కోర్సు కొనసాగుతున్నంతకాలం అమెరికాలో ఉండేందుకు అవకాశం ఉంది. కొత్త నిబంధన అమల్లోకి వస్తే నాలుగేళ్లకు మించి చదువు కొనసాగించాల్సిన వారు ఇమ్మిగ్రేషన్ అధికారుల అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. కోర్సు మార్చడం, మరో విశ్వవిద్యాలయానికి మారడం, అదే స్థాయిలో మరో డిగ్రీ చేయడం కూడా అనుమతితోనే సాధ్యమయ్యేది. ప్రభుత్వం జాతీయ భద్రత కారణంగా నిబంధనల్లో మార్పులు అవసరమని వాదించింది. అయితే ప్రభుత్వం చెప్పిన కారణాలు బలహీనంగా ఉన్నాయని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. కొత్త నిబంధన అమలైతే అమెరికా విశ్వవిద్యాలయాలు, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పీహెచ్‌డీ విద్యార్థులపై ప్రభావం ఎక్కువగా ఉండేదని కోర్టు పేర్కొంది. నేషనల్ సైన్స్ ఫౌండేషన్ గణాంకాల ప్రకారం అమెరికాలో డాక్టోరల్ కోర్సులు పూర్తయ్యేందుకు సుమారు 5.7 ఏళ్లు పడుతున్నాయి. విదేశీ విద్యార్థులు, పరిశోధకులపై పరిమితులు పెడితే అమెరికాకు నష్టం కలుగుతుందని కోర్టు అభిప్రాయపడింది. దాదాపు 22 వేల మంది కొత్త నిబంధనపై అభిప్రాయాలు పంపగా..ఎక్కువ మంది వ్యతిరేకించారు. తదుపరి విచారణ అక్టోబర్ 2న జరగనుంది.

## ప్రైవేట్ కోచింగ్‌పై చంద్రబాబు కొరడా

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్న ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వంపై బురదజల్లే లక్ష్యంతో విద్యార్థులను ఆందోళనలకు ఉసిగొల్పుతున్నారని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే సంస్థలపై చట్టప్రకారం ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాల యాజమాన్యాలు తమ స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. పోటీ పరీక్షల కోసం తమ వద్ద శిక్షణ పొందుతున్న యువతపై ఒత్తిడి తెచ్చి, వారిని రాజకీయ ప్రేరేపిత నిరసనలు, ధర్నాలలో పాల్గొనేలా చేస్తున్నట్లు తేలిందని అధికారులు పేర్కొన్నారు. దురుద్దేశంతోనే అభ్యర్థులను ఈ ఆందోళనల వైపు మళ్లిస్తున్నారని ముఖ్యమంత్రికి వివరించారు. వాస్తవానికి, ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026, జీవో నెంబర్ 9 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు నిర్దేశిత మార్గదర్శకాలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. అయితే, ఈ నిబంధనలను పక్కనపెట్టి కొన్ని సంస్థలు రాజకీయ కార్యకలాపాలు నడుపుతున్నాయని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, అభ్యర్థులను రాజకీయ కుట్రల్లోకి లాగాలని చూస్తే కఠిన పరిణామాలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఏ కోచింగ్ సెంటర్‌పైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంలో వెనుకాడేది లేదని స్పష్టం చేసింది.

## భారత్ 'కృత్రిమ సూర్యుడు' విజయవంతమైతే అపార లాభాలు

అపరిమిత, స్వచ్ఛమైన ఇంధనాన్ని సృష్టించే లక్ష్యంతో భారత్ చేపట్టిన 'కృత్రిమ సూర్యుడు' పరిశోధనల్లో మరో కీలక ముందడుగు పడింది. గుజరాత్‌లోని 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్' (ఐపీఆర్) ఆధ్వర్యంలోని స్టడీ స్టేట్ సూపర్ కండక్టింగ్ టోకామాక్ 1 (ఎస్ఎస్‌టీ 1) లో అత్యంత శక్తిమంతమైన కొత్త గైరోట్రాన్ వ్యవస్థను విజయవంతంగా అనుసంధానించారు. ఈ పరిణామంతో ఫ్యూజన్ టెక్నాలజీపై జరుగుతున్న పరిశోధనలు మరింత వేగవంతం కానున్నాయి. ఎస్ఎస్‌టీ 1 అనేది డోనట్ ఆకారంలో ఉండే ఒక ప్రయోగాత్మక ఫ్యూజన్ రియాక్టర్. సూర్యుడిలో శక్తి పుట్టే ప్రక్రియను భూమిపై సృష్టించి, తద్వారా అపారమైన శక్తిని ఉత్పత్తి చేయడమే ఈ పరిశోధనల ముఖ్య ఉద్దేశం. ఈ ప్రక్రియలో అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద ఉండే ప్లాస్మాను నియంత్రించడం అత్యంత కీలకం. తాజాగా ఏర్పాటు చేసిన 82.6 గిగాహెర్ట్జ్, 400 కిలోవాట్ల సామర్థ్యం గల గైరోట్రాన్, ఈ ప్లాస్మాను వేడిచేయడానికి, నియంత్రించడానికి ఉపయోగపడుతుంది. ఇప్పటికే ఉన్న 42 గిగాహెర్ట్జ్, 500 కిలోవాట్ల వ్యవస్థతో కలిసి ఇది పనిచేయనుండటంతో శాస్త్రవేత్తలకు ప్రయోగాల్లో మరింత సౌలభ్యం లభించనుంది. సూర్యుడు తన గురుత్వాకర్షణ శక్తితో అత్యంత వేడి ప్లాస్మాను నియంత్రిస్తే, భూమిపై ఆ ప్రక్రియ కోసం శక్తిమంతమైన అయస్కాంత క్షేత్రాలను ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ ప్లాస్మాను స్థిరంగా, ఎక్కువసేపు నిలపడమే ప్రస్తుతం శాస్త్రవేత్తల ముందున్న అతిపెద్ద సవాలు. భారత శాస్త్రవేత్తలు ఇప్పటికే తమ ప్రయోగాల్లో సూర్యుడి కేంద్రకం కన్నా కొన్ని రెట్లు అధికంగా, అంటే దాదాపు 20 కోట్ల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను సాధించి రికార్డు సృష్టించారు.

## సంపాదకీయం

# పౌరహక్కులపై ఉక్కుపాదం

# అలహాబాద్ హైకోర్టు చెంపపెట్టు!

చట్టాలు ప్రజలకు బాసటగా నిలిచి వారి హక్కులను కాపాడేందుకు చేస్తారు కానీ, సామాన్య ప్రజలను భయపెట్టడం చట్టాల లక్ష్యం కాదు. కానీ మన దేశంలో నిరసనలు తెలిపితే జాతీయ భద్రతా చట్టం లాంటి భయంకరమైన చట్టాలను ప్రయోగిస్తున్నారు. 24 సంవత్సరాల ఆకృతి చౌదరి అనే ఒక న్యాయశాస్త్ర విద్యార్థినిపై ప్రభుత్వం జాతీయ భద్రతా చట్టాన్ని ప్రయోగించి అరెస్ట్ చేసి ఐదు నెలలు దాటింది. ఆమె చేసిన నేరం నోయిడా ప్రాంతంలో కార్మికులు చేస్తున్న నిరసనలకు మద్దతు తెలుపుతూ నిరసన ప్రదర్శనలో పాల్గొనడం. అంటే దేశంలో హక్కుల కోసం కూడా పోరాడకూడదు అని ప్రభుత్వం భావిస్తున్నది; ప్రభుత్వం ఏది చెబితే అదే ప్రజలు శిరోధార్యం అనుకోవాలి. జాతీయ భద్రతా చట్టం అనేది దేశద్రోహులను కట్టడి చేయడానికి ఉద్దేశించిన చట్టం. కానీ వాటిని సామాజిక కార్యకర్తలపైన ప్రయోగించడం పరిపాటి అయిపోయింది. గౌతమబుద్ధ నగర్ (నోయిడా) పారిశ్రామిక ప్రాంతంలో ఫార్చ్యూన్ లీగల్ సంస్థ మరియు కొన్ని ఇతర పరిశ్రమల్లో పనిచేసే వేలాది మంది కార్మికులు మెరుగైన వేతనాలు, చట్టబద్ధమైన పని గంటల కోసం కొన్ని నెలలుగా నిరసనలు తెలుపుతున్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థిని, సామాజిక కార్యకర్త అయిన ఆకృతి చౌదరి కార్మికుల డిమాండ్లకు మద్దతుగా రంగంలోకి దిగి ఆందోళనలకు నాయకత్వం వహించారు. కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో మాట్లాడేందుకు, శాంతియుత నిరసనల్లో పాల్గొనేందుకు సిద్ధమైన ఆకృతి చౌదరిని పోలీసులు ఏప్రిల్ 11 న అదుపులోకి తీసుకున్నారు. ఏప్రిల్ 13 న పారిశ్రామిక ప్రాంతంలో కార్మికుల నిరసనలు తీవ్రరూపం దాల్చాయి. పోలీసులు, నిరసనకారుల నడుమ ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఏప్రిల్ 13 న జరిగిన అల్లర్లలో కార్మికులు హింసకు పాల్పడ్డారని, వాహనాలపై రాళ్లు రువ్వారని, ఆస్తి నష్టం కలిగించారని పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆ హింసకు ఆకృతి చౌదరి మాస్టర్‌మైండ్ అని, ఆమె రాతలు మరియు ప్రసంగాలే కార్మికులను రెచ్చగొట్టాయని పోలీసుల ఆరోపణ. సాధారణ పోలీసు కేసుల్లో ఆమెకు బెయిల్ లభించే అవకాశం ఉన్నందున, శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నదనే నెపం మీద నోయిడా పోలీసులు ఆమెపై 2024 మే నెలలో తీవ్రమైన రాష్ట్రీయ భద్రతా చట్టాన్ని ప్రయోగించి జైలుకు పంపారు. ఈ విధంగా కార్మికుల హక్కుల కోసం ప్రారంభమైన ఒక శాంతియుత ఉద్యమం, పోలీసుల ముందస్తు అరెస్టులు మరియు దానిని అనుసరించి మోపబడిన ఎన్‌ఎస్‌ఏ నిర్బంధంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన న్యాయ వివాదంగా మారింది. దేశంలో జాతీయ భద్రతా చట్టం కింద ఎక్కువ కేసులను నమోదు చేస్తున్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్. ముఖ్యంగా గోవధ ఆరోపణలు, మతపరమైన ఘర్షణలకు సంబంధించి నిర్బంధంలో ఉన్న వ్యక్తులు వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్లు అలహాబాద్ హైకోర్టులో ఎక్కువగా పెండింగులో ఉన్నాయి. సాధారణ పోలీసు కేసుల్లో బెయిల్ రాకుండా నిరోధించడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(3) పరిధిలోని ముందస్తు నిర్బంధ చట్టాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని దేశంలోని న్యాయస్థానాలు చేస్తున్న వ్యాఖ్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఆకృతి చౌదరి కేసులో పోలీసులు అల్లిన కథనాన్ని గమనిస్తే దేశంలో చట్టాలు ఎంత దుర్వినియోగం అవుతున్నాయో అర్థమవుతుంది. దానిమీద అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వాల చేతుల్లో కీలుబొమ్మగా మిగిలిపోతున్న వ్యవస్థల నిస్సహాయతకు అద్దం పడుతున్నది. ఆకృతి చౌదరిపై మోపిన రాష్ట్రీయ భద్రతా చట్టం నిర్బంధాన్ని న్యాయస్థానం రద్దు చేసింది. హైకోర్టు తన తీర్పులో స్పష్టంగా చెప్పిన విషయాలు: ఆధారాలు లేవు, కేవలం ఊహాగానాలే: ఆకృతి చౌదరి నిరసనకారులను హింసకు, రాళ్లు రువ్వడానికి లేదా దహనకాండకు ప్రేరేపించినట్లు చూపే ఎటువంటి వీడియోలు కానీ వాట్సాప్ చాట్ ఆధారాలు కానీ ప్రభుత్వం చూపలేకపోయింది. పోలీసులు సేకరించిన వీడియోల్లో ప్రజలు శాంతియుతంగా తమ రాజ్యాంగ హక్కుల పరిధిలో మెరుగైన వేతనాల కోసం డిమాండ్ చేస్తున్నట్లు ఉన్నదే తప్ప హింసకు పాల్పడినట్లు లేదని కోర్టు స్పష్టం చేసింది. పోలీసుల కథనం సృష్టించిందే తప్ప వాస్తవం కాదని, అదొక అల్లిన కథ అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆకృతి చౌదరి కేసులో పోలీసులు ఎంత దుర్మార్గంగా వ్యవహరించారో న్యాయస్థానం తన తీర్పులో స్పష్టంగా పేర్కొన్నది. ఏప్రిల్ 13 న జరిగిన హింసకు ఆకృతి మాస్టర్‌మైండ్ అని పోలీసులు పేర్కొన్నారు, కానీ ఆమెను ఏప్రిల్ 11 నే అదుపులోకి తీసుకున్నారని ఆధారాల ద్వారా స్పష్టమైంది. బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 130 కింద పోలీసులు చెప్పడం కేవలం ఒక నాటకం అని న్యాయస్థానం తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. సాధారణమైన సంఘటనలకు రాష్ట్రీయ భద్రతా చట్టాన్ని ఉపయోగించినందుకు కోర్టు మండిపడింది. పౌరుల ప్రాథమిక హక్కులను, స్వేచ్ఛను ఇలాంటి నిరోధక నిర్బంధ చట్టాలతో కాలరాయకూడదని వ్యవస్థలకు గుర్తు చేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసనలు ప్రెజర్ కుక్కర్‌కు ఉండే సేఫ్టీ వాల్వ్ లాంటివని, వాటిని అణిచివేయడం వలన మరింత ప్రమాదం పెరుగుతుందని న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలను ఇప్పటికైనా వ్యవస్థలు ముందస్తు హెచ్చరికగా భావించాలి. ఇక్కడ హైకోర్టు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు ఒక గట్టి సూచన కూడా చేసింది. వారు రాజకీయ నాయకుల పట్ల కాకుండా, రాజ్యాంగానికి మరియు ప్రజాస్వామ్యంలో అసలైన యజమానులైన ప్రజలకు విధేయులుగా ఉండాలని సూచించింది. చట్టవ్యతిరేకంగా, ఆధారాలు లేకుండా ఆకృతిని 5 నెలల పాటు జైల్లో ఉంచినందుకు గాను ఆమెకు 5 లక్షల రూపాయలను నష్టపరిహారంగా చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఈ పరిహారాన్ని ప్రభుత్వ ఖజానా నుండి కాకుండా బాధ్యులైన అధికారుల జీతాల నుండి రికవరీ చేయాలని ఆదేశించింది. బాధ్యుల్లో ఒకరైన నోయిడా జిల్లా మేజిస్ట్రేట్ మేధా రూపంపై కోర్టు ప్రత్యేకంగా నమోదు చేసిన వ్యాఖ్య అత్యంత తీవ్రమైనది. జిల్లా మేజిస్ట్రేట్ రాజ్యాంగంపై చేసిన ప్రమాణాన్ని ఉల్లంఘించారని, తన విచక్షణాధికారాన్ని దుర్వినియోగపరిచి కాగితాలపై సంతకాలు చేసి ఈ నిర్బంధ ఉత్తర్వులను జారీ చేశారని ధర్మాసనం మండిపడింది. అధికార దుర్వినియోగం చేసిన ఐఏఎస్ అధికారులపైనే నేరుగా కోర్టు పరిహార చర్యలు ఆదేశించడంతో ఈ కేసు ఐఏఎస్, ఐపీఎస్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అధికారులు ఇదే పద్ధతిని కొనసాగిస్తే ఉత్తరప్రదేశ్ రాష్ట్రం "ఓర్వెలియన్ డిస్టోపియా"గా—అంటే ప్రజాస్వామ్యం, వ్యక్తిగత స్వేచ్ఛ పూర్తిగా నశించి పౌరులు జీవించడానికే భయపడే భయానక వాతావరణంగా—మారే ప్రమాదం ఉన్నదని ఘాటైన పదజాలంతో హెచ్చరించింది. నిరసన తెలిపే హక్కుకు నేరుగా ఒక ప్రత్యేక నిబంధన లేకపోయినప్పటికీ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కింద ఉన్న ప్రాథమిక హక్కుల కలయిక ద్వారా ఈ హక్కు సంక్రమిస్తుంది అని ప్రభుత్వాలకు మళ్లీ మళ్లీ గుర్తుచేయవలసి రావడం దురదృష్టకరం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) భావప్రకటనా స్వేచ్ఛను కల్పిస్తే, 19(1)(బి) ఆయుధాలు లేకుండా శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును, ధర్నాలు-ర్యాలీలు చేసే హక్కును ప్రసాదించింది. ఇవి ప్రభుత్వాలకు తెలుసు; వారి ఆజ్ఞలను తూచా తప్పకుండా పాటించే అధికారులకు తెలుసు. హక్కుల కోసం చేసే నిరసనలను, పాలనపైన వచ్చే విమర్శలను సహించలేని ప్రభుత్వ చేతుల్లో రాజ్యాంగం కల్పించిన రక్షణ కూడా ప్రశ్నార్థకం అవుతున్నది. "చట్టం ప్రజల కోసమే కానీ ప్రజలను భయపెట్టడానికి కాదు" అని ఎలుగెత్తి చాటింది అలహాబాద్ హైకోర్టు.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు

### సెప్టెంబర్ 16

SEP 16

- 1994: అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం
- 1763: హైదరాబాదు నిజాం పాలకుడు సలాబత్ జంగ్ మరణం (జ.1718).
- 1932: మలేరియా పారసైట్ జీవితచక్ర పరిశోధకుడు రోనాల్డ్ రాస్ మరణం.(జ.1857).
- 1945: భారత రాజకీయ నాయకుడు పి. చిదంబరం జననం.
- 1954: సత్యం కంప్యూటర్స్ మాజీ అధిపతి బైర్రాజు రామలింగరాజు జననం.
- 1969: భారత మహిళా క్రికెట్ క్రీడాకారిణి ప్రమీలా భట్ జననం.
- 1975: ప్రపంచంలో మూడో అతి పెద్ద ద్వీప దేశం ప్యాపువా న్యూ గినీ ఆస్ట్రేలియా నుంచి స్వాతంత్ర్యం వచ్చింది.
- 1975: దక్షిణ భారత సినిమా నటి మీనా జననం. (చిత్రంలో)
- 1987: భారత రాజకీయవేత్త దొడ్డపనేని ఇందిర మరణం (జ.1937).
- 2012: తెలుగు హాస్య నటుడు, సుత్తివేలుగా సుపరిచితుడైన కురుమద్దాలి లక్ష్మీ నరసింహారావు మరణం (జ.1947).
- 2013: హేతువాది, వామపక్షవాది తమ్మారెడ్డి గోపాలకృష్ణమూర్తి మరణం. (జ.1920)



మీనా

## నారా లోకేశ్ నాయకత్వ లక్షణాలను చూసి

# గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోంది

- కూటమి ప్రభుత్వం రెండేళ్లలో 8 లక్షల ఉద్యోగాలు కల్పించిందన్న అనురాధ
- లోకేశ్ నాయకత్వాన్ని చూసి గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోందని ఆగ్రహం
- జగన్ పాలనలో డీఎస్సీ నియామకాలు సున్నా అని విమర్శ
- ఏపీపీఎస్సీలో రూ.150 కోట్ల స్కామ్ జరిగిందని ఆరోపణ



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే రాష్ట్రంలో 8 లక్షల ఉద్యోగాలు కల్పించిందని, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతోందని ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ స్పష్టం చేశారు. లోకేశ్ నాయకత్వ పటిమను, పనితీరును చూసి ఓర్వలేకే 'గొడ్డలి పార్టీ' (వైసీపీ) ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతోందని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ నియామకాలు, ఎంఎస్ఎంఈ, స్కిల్ డెవలప్‌మెంట్, ఐటీ, పర్యాటక రంగాల ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించామని అనురాధ వివరించారు. అయితే, లోకేశ్ ఇమేజ్‌ను దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే మెగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా వేయలేదని, ఆయన హయాంలో నిరుద్యోగితలో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని విమర్శించారు. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం దాదాపు 4,100 మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ విధానాల వల్లే అదానీ గ్రూప్, లులూ గ్రూప్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, కియా అనుబంధ పరిశ్రమలు, అమర్‌రాజా బ్యాటరీస్ వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక కంపెనీలు రాష్ట్రం నుంచి తరలిపోయాయని అనురాధ ఆరోపించారు. యువతను గంజాయికి బానిసలుగా మార్చి, వారి భవిష్యత్తును నాశనం చేశారని అన్నారు. ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలపై సిట్ విచారణలో రూ.150 కోట్ల స్కామ్ బయటపడిందని, ప్రభుత్వ స్ట్రాంగ్ రూమ్ నుంచి పేపర్లను ప్రైవేట్ రిసార్టులకు తరలించి అనర్హులతో మూల్యాంకనం చేయించారని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణంపై జగన్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తన 16 నెలల జైలు జీవితం, తండ్రి శవం పక్కన సంతకాల సేకరణ, 31 క్రిమినల్ కేసులు, వివేకా హత్య వంటి అంశాలపై జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో, సెప్టెంబర్ 16 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'యువత భవితకు భరోసా' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అనురాధ ప్రకటించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు యూనివర్సిటీలు, కళాశాలలకు వెళ్లి ప్రభుత్వ ఉద్యోగ కల్పన కార్యక్రమాలను, మెగా డీఎస్సీ పారదర్శకతను వివరిస్తారని తెలిపారు. అదే సమయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ అక్రమాలను కూడా యువతకు తెలియజేస్తారని చెప్పారు. పచ్చి అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న గొడ్డలి పార్టీ ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

## ఆళ్ల నాని హఠాన్మరణం..

# పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి

- ఆయన మరణం పట్ల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం

ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల నాని హఠాన్మరణం చెందడం తెలిసిందే. ఆయన ఆకస్మిక మరణ వార్త రాష్ట్ర రాజకీయ వర్గాలను విషాదంలో ముంచింది. ఏలూరుకు చెందిన కీలక నేతగా, సౌమ్యుడిగా పేరున్న ఆళ్ల నాని మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. ఆళ్ల నాని మృతి పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన హఠాన్మరణం తనను ఎంతో బాధించిందని అన్నారు. "మూడు పర్యాయాలు ఏలూరు శాసనసభ్యునిగా, ఒకసారి ఎమ్మెల్సీగా ప్రజలకు సేవలు అందించారు నాని గారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.



నాని గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని పవన్ కల్యాణ్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆళ్ల నాని రాజకీయ ప్రస్థానం ఏలూరు కేంద్రంగా కొనసాగింది. ఆయన ఏలూరు శాసనసభ నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గతంలో ఒకసారి ఎమ్మెల్సీగా కూడా ప్రజాసేవ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో కీలకమైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు, ఉప ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు.

# ఏపీలో పురపాలక ఎన్నికల దిశగా ఈసీ అడుగులు

అమరావతి: ఏపీలో పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ప్రక్రియ వేగవంతమైంది. ఇందులో భాగంగా మరో 12 నగరపాలక సంస్థలు, 29 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు రెండు వేర్వేరు నోటిఫికేషన్లను జారీ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. ఫారం1 నోటీసుతో పాటు వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాలను ఈనెల 22న ప్రకటించాలని పేర్కొన్నారు. 2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా పరిగణించి, తాజా అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా రూపకల్పన చేయాలని సూచించారు. మొత్తం 17 నగర పాలక సంస్థలకు గాను విజయనగరం కార్పొరేషన్‌లో వార్డుల పునర్విభజన ప్రక్రియ ముందుగా పూర్తి కావడంతో అక్కడ సెప్టెంబరు 3 నాటికే ఓటర్ల జాబితా ప్రచురణ పూర్తయింది. అలాగే, రాష్ట్రంలోని 106 పురపాలక, నగర పంచాయతీల్లో డిలిమిటేషన్ పూర్తయిన 58 చోట్ల కూడా సెప్టెంబరు 3నే జాబితాలను వెల్లడించారు. మిగిలిన 12 నగర పాలక సంస్థలు, 29 పురపాలక, నగర పంచాయతీల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియ సెప్టెంబరు 14 నుంచి 17 మధ్య పూర్తి కానున్నందున.. ఆయా చోట్ల ఓటర్ల జాబితా ప్రచురణకు కొత్త తేదీని ఖరారు చేయాలని




పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సెప్టెంబరు 13న ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిశీలించిన ఎస్ఈసీ.. సెప్టెంబరు 22ను ప్రచురణ తేదీగా ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఓటర్ల జాబితాల ప్రచురణతో ఆయా పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ సిద్ధం అవుతోంది. మేయర్లు, పురపాలక ఛైర్మన్లు, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారు చేయడానికి ప్రభుత్వానికి మరింత మార్గం సుగమం కానుంది. సంబంధిత కార్పొరేషన్ కమిషనర్లు , మున్సిపల్ కమిషనర్లు ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## విహారయాత్రలో విషాదం.. సోకిలేరు వాగులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గల్లంతు

చింతూరు: పోలవరం జిల్లా చింతూరు మండలంలో సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద వాగులో స్నానానికి దిగిన ఆరుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో ఒకరు గల్లంతయ్యారు. హైదరాబాద్ లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న ఆరుగురు స్నేహితులు విహారయాత్రకు వెళ్లారు. హైదరాబాద్ నుంచి విజయవాడ చేరుకుని.. అక్కడి నుంచి రాజమహేంద్రవరం , అన్నవరం ఆలయ దర్శనం అనంతరం విశాఖపట్నం వెళ్లారు. అరకు, వంజంగి ప్రాంతాలను సందర్శించి మారేడుమిల్లి చేరుకున్నారు. మారేడుమిల్లి నుంచి చింతూరు మండలం తులసిపాక గ్రామానికి



సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలోని సోకిలేరు వ్యూ పాయింట్‌కు వెళ్లారు. అక్కడ వాగులో స్నానం చేసేందుకు దిగారు. వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో ఆరుగురు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. వెంటనే అప్రమత్తమైన అటవీ శాఖ, పోలీస్ అధికారులు స్థానికుల సహకారంతో ఐదుగురిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. విజయవాడకు చెందిన కోస్తూరి నీలేష్ (26) వరద నీటిలో గల్లంతవ్వగా మంగళవారం సాయంత్రం మృతదేహం లభ్యమైంది. నీలేష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్ల కేటాయింపు: కేంద్ర మంత్రి పెమ్మసాని

అమరావతి: తెలుగు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం 5 లక్షల ఇళ్లు కేటాయించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించినట్లు వెల్లడించారు. 2024లో కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చేసిన కేటాయింపుల కంటే ఏపీకి అదనంగా 2.25 లక్షలు, తెలంగాణకు 1.25 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాలకు ఇంత



పెద్ద మొత్తంలో కేటాయించడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. "2019 24 మధ్య కాలంలో ఏపీకి 1.78 లక్షల ఇళ్లు కేటాయించగా.. దానిలో కేవలం 42వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. 201924 మధ్య గ్రామీణ ఆవాస యోజన పథకంలో తెలంగాణ చేరలేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి రెండుమూడు సార్లు ఇళ్ల కేటాయింపు కోసం విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం అడిగిన దానికంటే ఎక్కువగానే ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం తరపున రూ.1.20 లక్షల ప్రాథమిక ఆర్థిక సాయం అందిస్తాం. అదనపు సాయంతో దాదాపు రూ.1.80 లక్షల వరకు లబ్ధి చేకూరుతుంది. స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్డికి రూ.12 వేల సహాయం అందిస్తాం. ఆవాస్ ప్లస్ యాప్‌తో పారదర్శకంగా ఎంపిక జరుగుతుంది. జియో ట్యాగింగ్‌తో లబ్ధిదారుల నమోదుకు కేంద్రం సెల్ఫ్ సర్వే సదుపాయం కల్పించింది. ఆదాయ అర్హత పరిమితి రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మోటార్ బైక్, ఫ్రిజ్ ఉన్నా అర్హత కోల్పోకుండా సవరణలు చేసింది. కొత్త, పాత ఇళ్లన్నీ 23 ఏళ్లలో నిర్మాణం పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్ల కేటాయింపు జరుగుతుంది" అని మంత్రి పెమ్మసాని వెల్లడించారు.

## ఏపీలో నిరుద్యోగులకు గుడ్‌న్యూస్.. 892 పోస్టులకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు

అమరావతి: ఏపీలో నిరుద్యోగులకు గుడ్‌న్యూస్. వివిధ శాఖల్లో మొత్తం 892 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ (APPSC) వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేసింది. వీటిలో 163 పోస్టులతో గ్రూప్1 నోటిఫికేషన్ కూడా ఉంది. ఈ మేరకు వివరాలను ఏపీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. గ్రూప్1 పోస్టులకు అక్టోబర్ 6 నుంచి 27 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. దీని ద్వారా భర్తీ చేయనున్న వాటిలో డిప్యూటీ కలెక్టర్లు 11, ట్యాక్స్ సర్వీసెస్ అసిస్టెంట్ కమిషనర్లు 14, డీఎస్పీ సివిల్ 36, డీఎస్పీ కమ్యూనికేషన్స్ 3, డీఈవోలు




14, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్లు 1, ఆర్టీవోలు 3, డిప్యూటీ రిజిస్ట్రర్ కోఆపరేటివ్ సర్వీసెస్ 15, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్2 పోస్టులు 12, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ 2, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ 3, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ 14, డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ 35 పోస్టులు ఉన్నాయి. మిగిలిన 729 పోస్టుల భర్తీకి అర్హత, నియామక పరీక్షల వివరాలు, ఇతర అంశాలను ఏపీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. వీటి కోసం అక్టోబర్ 16 నుంచి నవంబర్ 5 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

## కాకినాడలో ఇన్‌కాయిస్ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు కీలక ముందడుగు

కాకినాడ: కాకినాడలో ఇన్‌కాయిస్ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు కీలక ముందడుగు పడింది. ఈ ప్రతిపాదన కార్యరూపం దిశగా సాగుతోందని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. ఈ మేరకు తెదేపా ఎంపీ సానా సతీశ్‌కు లేఖ రాశారు. కాకినాడలో ఇన్‌కాయిస్ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయాలని జులై 21న జితేంద్రసింగ్‌ను కలిసి సానా సతీశ్ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీకి కేంద్రమంత్రి లేఖ రాశారు. ఇన్‌కాయిస్ ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే భూమిని గుర్తించింది. ఆ ప్రతిపాదనను సంబంధిత శాఖ ఆమోదానికి అధికారులు పంపారు. మత్స్యకారుల జీవనోపాధి, సముద్ర భద్రత పెంపునకు ఇన్‌కాయిస్ కేంద్రం దోహదపడనుంది. దీని ద్వారా మత్స్యకారులకు సముద్ర సమాచార సేవలు మరింత చేరువ కానున్నాయి. జాలర్లకు పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ సమాచారం అందుబాటులోకి వచ్చే అవకాశముంది. కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో దీన్ని ఏర్పాటుచేస్తామని ఎంపీ సానా సతీశ్ తెలిపారు.

## విజయవాడ కార్పొరేషన్ డివిజన్లు 86కి పెంపు.. గెజిట్ విడుదల

విజయవాడ: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో డివిజన్లు, వార్డుల సంఖ్యను పెంచుతూ నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే కీలకమైన విజయవాడ (Vijayawada) నగర పాలక సంస్థలో డివిజన్ల సంఖ్యను గణనీయంగా పెంచింది. ఇప్పటివరకు విజయవాడ కార్పొరేషన్‌లో 64 డివిజన్లు ఉండగా, కొత్తగా మరో 22 డివిజన్లను జోడించి మొత్తం సంఖ్యను 86కు పెంచుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కార్పొరేషన్ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఈ ఏడాది మే నెలలోనే డివిజన్ల పెంపు ప్రతిపాదనలు తెరపైకి రాగా....మే 18 నుంచి 24 వరకు ప్రజలు, వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు, సూచనలను అధికారులు స్వీకరించారు. ఈ పునర్విభజన ప్రక్రియలో అత్యధిక మార్పులు విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోనే చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు తూర్పు నియోజకవర్గంలో ఉన్న 21 డివిజన్ల సంఖ్య కాస్తా 29కి చేరాయి. ప్రజల నుంచి పెద్దగా అభ్యంతరాలేవీ రాకపోవడంతో అధికారులు 86 డివిజన్ల జాబితాను అధికారికంగా ఖరారు చేశారు.




## ఏపీ గవర్నర్ కాన్వాయ్‌కు తప్పిన ప్రమాదం

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రయాణిస్తున్న కాన్వాయ్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకి వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. గవర్నర్ జస్టిస్ నజీర్.. మచిలీపట్నం సమీపంలోని మంగినపూడి సాగర తీరంలో ఏర్పాటు చేసిన మహాగణపతి ఉత్సవాలకు హాజరై 63 అడుగుల



సప్తమృత్తిక విజయగణపతిని దర్శించుకున్నారు. సాయంత్రం మంగినపూడి నుంచి విజయవాడ వస్తుండగా పోరంకి సమీపంలోకి రాగానే.. గుర్తు తెలియని వ్యక్తి ఒక్కసారిగా కాన్వాయ్‌కు అడ్డొచ్చాడు. భద్రతా సిబ్బంది వెంటనే స్పందించడంతో గవర్నర్ కాన్వాయ్‌కు ప్రమాదం తప్పింది.

## కుటుంబంతో కలిసి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్.. ఫొటోలు

- **ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు**
- **శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు, లోకేశ్, భువనేశ్వరి, నారా బ్రహ్మణి**
- **పెద్దశేష వాహన సేవలో పాల్గొన్న చంద్రబాబు, లోకేశ్**
- **2027 టీటీడీ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సీఎం**

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల తొలిరోజున రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడం తెలిసిందే. ఈ పవిత్ర వేడుకలలో మంత్రి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం తిరుమల చేరుకున్న మంత్రి లోకేశ్, ఆయన కుటుంబ సభ్యులు తొలుత బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయానికి చేరుకోగా, అధికారులు మంగళవాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి భువనేశ్వరి దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలను అందజేశారు.



అనంతరం సీఎం చంద్రబాబు, నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, నారా బ్రహ్మణి స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో పండితులు వారికి వేదాశీర్వచనం అందించగా, అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. దర్శనానంతరం ఆలయం వెలుపల జరిగిన పెద్దశేష వాహనసేవలో పాల్గొని మలయప్ప స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, ఇతర ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.







## మారు వేషంలో.. సామాన్యుడిలా పోలవరం ఎమ్మెల్యే

బుట్టాయగూడెం: టీషర్ట్, గళ్ల లుంగీ, ముఖానికి మాస్క్ ధరించి సామాన్యుడిలా మారువేషంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఏలూరు జిల్లా బుట్టాయగూడెం తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చిన వారికి అందిస్తున్న సేవలు పరిశీలించారు. సిబ్బంది తీరును గమనించి మండిపడ్డారు. ఉదయం 11.30 గంటల నుంచి సుమారు గంట పాటు తహసీల్దార్ కార్యాలయంలోనే ఉన్నారు. ఎమ్మెల్యేను ఎవరూ గుర్తు పట్టలేనంతగా మారు వేషంలో వచ్చారు. బుట్టాయగూడేనికి చెందిన మాధవరావు అనే విశ్రాంత ఉపాధ్యాయుడు స్థల వివాదం పరిష్కారం కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నానని ఆవేదన వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. నిర్లక్ష్యాన్ని సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. చిత్తశుద్ధితో సేవలు అందించాలని ఆదేశించారు.

# ఐటీ భవనంలోకి అక్రమంగా చొరబాటు.. గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్: గచ్చిబౌలి లోని ప్రముఖ ఐటీ భవనం 'మంత్రి కాస్మోస్' ప్రాంగణంలోకి కొందరు అపరిచిత వ్యక్తులు అక్రమంగా చొరబడి విధ్వంసానికి పాల్పడటంతో పాటు భద్రతా సిబ్బందిపై దాడి చేసిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నానక్‌రామ్‌గూడ సర్వే నెంబర్ 130లో ఉన్న 'మంత్రి కాస్మోస్' భవనంలో గత 11 ఏళ్లుగా పలు అంతర్జాతీయ బహుళజాతి కంపెనీలు ఇక్కడ ఐటీ సేవలు అందిస్తున్నాయి. సుమారు 5,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈనెల 13న ఉదయం మురళీధర్ రెడ్డి, గడ్డం రవిల నేతృత్వంలో వచ్చిన ఒక గుంపు.. కె.చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల




మేరకు పనిచేస్తున్నామని భవనం నైరుతి మూల గేటు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించింది. కాంపౌండ్ గోడ లోపలి నిర్మాణాలను ధ్వంసం చేసి, ఒక వాహనంలో తెచ్చిన రేకులను (టిన్ షీట్లు) పాతి స్థలాన్ని ఆక్రమించేందుకు వారు యత్నించారు. అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బందిని తోసివేసి చంపేస్తామని బెదిరింపులకు దిగారు. సమాచారం అందుకున్న నిర్వహణ ఏజెన్సీ ప్రతినిధి రవీందర్ నాయక్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఆక్రమణదారులను నిలదీశారు. ఈ వ్యవహారం మొత్తం సీసీటీవీ కెమెరాల్లో రికార్డవ్వగా.. సంబంధిత ఫుటేజీని పోలీసులకు అందించినట్లు తెలిపారు. ఘటనపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేను చెప్పేవి అబద్ధాలైతే..
# రాజకీయాల నుంచి వైదొలగుతా

**: మాధవరం కృష్ణారావు**

హైదరాబాద్: రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో తన గురించి చేసిన ప్రస్తావనపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారు. హైదర్‌నగర్‌లో 145, 163 సర్వే నంబర్లలోని భూమి చాలా ఏళ్లుగా రిజిస్ట్రేషన్లు కావట్లేదని మంత్రి తప్పుదోవ



పట్టించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా ఏడాదిపాటు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలిపారు. 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీకి రానిస్తే.. 22ఏపై అన్ని ఆధారాలతో నిరూపిస్తానని, తాను చెప్పేవి అబద్ధాలైతే రాజకీయాల నుంచి వైదొలగుతానని కృష్ణారావు అన్నారు.

# లోతుకుంట భూ వివాదంపై సుప్రీం తీర్పు.. స్పందించిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్: లోతుకుంటలో 40 ఎకరాల భూ వివాదంలో రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. కాలపరిమితి ముగియడంతో సాంకేతిక కారణాలతో సుప్రీంకోర్టు ఆ పటిషన్‌ను కొట్టివేసిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో అన్ని భాగస్వామ్య వర్గాలు, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని రంగనాథ్ తెలిపారు. జనరల్ ల్యాండ్ రిజిస్టర్ 243లో పేర్కొన్న 119 ఎకరాల భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని, సర్వే ద్వారా లోతుకుంట భూమి హద్దులు, వాస్తవ పరిస్థితులు స్పష్టంగా బయటపడతాయన్నారు. లోతుకుంటలోని సర్వే నంబరు 1, 2లోని శాంతా శ్రీరాం బిల్డర్స్ లేఔట్‌కు ప్రస్తుతం హైడ్రా



కాపాడిన ప్రభుత్వ భూమికి మధ్య దూరం దాదాపు 3 కిలోమీటర్ల వరకూ ఉందని హైడ్రా హైకోర్టుకు విన్నవించింది. సర్వే నంబర్ 1, 2 కు సంబంధించి ప్రైవేట్ భూమిపై ఉన్న కోర్టు ఉత్తర్వులకు జీఎల్ఆర్ నంబర్ 243, 255కు ఎలాంటి సంబంధం లేదని హైడ్రా వాదించింది. ఈ వివాదంపై ఇటు ప్రభుత్వం, అటు నిర్మాణ సంస్థ ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించడంతో విచారణ జరిపిన సుప్రీంకోర్టు... సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేసింది.

# 'గోషామహల్‌లో బంగారం, వజ్రాలతో గణేశుడు'.. స్పందించిన పోలీసులు!

- **గోషామహల్ గణేశుడిపై సోషల్ మీడియా ప్రచారం అవాస్తవం**
- **పంచలోహ విగ్రహమంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించిన పోలీసులు**
- **బంగారు తాపడం, వజ్రాల అలంకరణ ఉందన్నది అబద్ధమని వెల్లడి**
- **వదంతులు నమ్మొద్దని, షేర్ చేయొద్దని ప్రజలకు పోలీసుల సూచన**

హైదరాబాద్‌లోని గోషామహల్‌లో ప్రతిష్ఠించిన 'లాల్‌బాగ్‌చా రాజా గణేశ్ 2026' విగ్రహంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు



సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పుకార్లను ప్రజలు నమ్మవద్దని వారు విజ్ఞప్తి చేశారు. గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ఓ గణేశుడి విగ్రహం గురించి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ విగ్రహాన్ని పంచలోహాలతో తయారు చేశారని, 48 కిలోల బరువుతో పాటు 24 క్యారెట్ల బంగారు తాపడం చేశారని, అలాగే 3,83,800 కృత్రిమ వజ్రాలతో అలంకరించారని కొన్ని పోస్టులు వైరల్ అయ్యాయి. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సైతం నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఈ ప్రచారంపై గోషామహల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ స్పందించారు. సోషల్ మీడియాలో పేర్కొంటున్నట్లుగా ఈ విగ్రహాన్ని పంచలోహాలతోగానీ, బంగారంతోగానీ తయారు చేయలేదని ఆయన తేల్చిచెప్పారు. సదరు ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇటువంటి నిరాధారమైన వదంతులను నమ్మవద్దని, సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని ఇతరులకు చేరవేసే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# సీఎం రేవంత్‌రెడ్డితో నాకు గొడవల్లేవ్

**: మహేశ్‌కుమార్ గౌడ్**

హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రయాణం ఎంతో ఉత్సాహంగా సాగిందని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. బూత్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమన్నారు. కుల సర్వేతో తెలంగాణలో నిజమైన సామాజిక న్యాయం జరిగిందన్నారు. కుల సర్వేను కేంద్రం తొక్కి పెట్టడం దురదృష్టకరమని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశ వ్యాప్తంగా అమలు చేస్తామని తెలిపారు. "సీఎం రేవంత్‌రెడ్డితో నాకు ఎక్కడా గొడవ జరగలేదు. పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమే. మా మధ్య గ్యాప్ ఉందని, గొడవ జరిగిందని ప్రచారం జరుగుతోంది. అలాంటివి ఏమీ లేవు. సీఎంతో అభిప్రాయ భేదాలు వచ్చినా సాయంత్రానికే సరి చేసుకున్నాం. పార్టీ విషయంలో సీఎం



ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు. బీసీ మంత్రిని తొలగించినప్పుడు నేను కూడా బాధపడ్డా. ఏఐసీసీ నిర్ణయం మేరకే సురేఖపై చర్యలు తీసుకున్నాం. క్రమశిక్షణ తప్పితే ఎవరిపైన అయినా చర్యలు తప్పవు. క్రమశిక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఏఐసీసీ నిర్ణయించింది'' అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

# పోలీసుల ఎదుట విచారణకు హాజరైన యూట్యూబర్ నందన

- **గడువుకు ఒకరోజు ముందే పోలీసుల ఎదుట హాజరైన యూట్యూబర్ నందన**
- **విదేశీ ఉద్యోగాల పేరుతో మోసం చేశారనే ఆరోపణలు**
- **ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

విదేశీ ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ నందన, గడువు కంటే ఒకరోజు ముందే మరోసారి పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం అధికారులు ఆమెను విచారించారు. వాస్తవానికి, ఆమె సెప్టెంబర్ 16వ తేదీలోగా విచారణకు హాజరుకావాల్సి ఉండగా, ఒకరోజు ముందుగానే న్యాయవాదులతో కలిసి రావడం గమనార్హం. సుమారు మూడు గంటల పాటు కొనసాగిన ఈ విచారణలో పోలీసులు ఆమెకు 20 ప్రశ్నలు సంధించారు. కన్సల్టెన్సీ వ్యవహారాలన్నీ తన భర్త పర్యవేక్షించేవారని, ఆ లావాదేవీలతో తనకు ఎటువంటి సంబంధం లేదని ఆమె పోలీసులకు తెలిపినట్లు సమాచారం. తనపై జారీ చేసిన లుక్ అవుట్ నోటీసులను ఉపసంహరించుకోవాలని ఆమె ఈ సందర్భంగా పోలీసులను కోరారు. విచారణకు తాము పూర్తిస్థాయిలో సహకరిస్తామని ఆమె హామీ ఇవ్వగా, ఆ విన్నపాన్ని పరిశీలిస్తామని పోలీసులు వెల్లడించారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామనే నెపంతో నందన, ఆమె భర్త పలువురిని మోసం చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో ఆ దంపతులిద్దరూ అజ్ఞాతంలోకి వెళ్లగా, ఆంధ్రప్రదేశ్ పోలీసులు వారిపై లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశారు. ఇటీవల బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో విదేశాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె పాస్‌పోర్ట్, వీసా తనిఖీ చేసిన



అధికారులు, ఆమెపై ఎల్ఓసీ ఉన్నట్లు గుర్తించి వెంటనే ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు. ఆ సమయంలో ఆమెను ప్రాథమికంగా విచారించి, మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆమె నిర్దేశిత గడువు కంటే ముందే పోలీసుల విచారణకు హాజరయ్యారు.

## అల్లు అర్జున్ మామపై
# గచ్చిబౌలిలో కేసు నమోదు

- **నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిపై కేసు**
- **నానక్‌రామ్‌గూడ భూ వివాదంపై గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు**
- **గేట్ల తాళాలు పగలగొట్టి చొరబడ్డారని ఆరోపణ**
- **సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులకు సాక్ష్యంగా అందజేత**
- **ఉద్యోగులు, నివాసితులకు రక్షణ కల్పించాలని వినతి**

ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిపై హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నగరంలోని ఐటీ కారిడార్ పరిధిలోని నానక్‌రామ్‌గూడలో గల ఒక భూవివాదానికి సంబంధించి ఆయనపై క్రిమినల్ ఫిర్యాదు దాఖలైంది. నానక్‌రామ్‌గూడలోని 'మంత్రి కాస్మోస్' ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ రెడ్డి మరికొందరితో కలిసి తమ భవన ప్రాంగణంలోకి అక్రమంగా ప్రవేశించారని వారు ఆరోపించారు. గేట్ల తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడటమే కాకుండా, అడ్డుకోబోయిన సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, ఫొటోలను ఒక పెన్ డ్రైవ్‌లో నిక్షిప్తం చేసి, గచ్చిబౌలి పోలీసులకు సాక్ష్యంగా అందజేశారు. చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఆయన అనుచరులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఈ ఫిర్యాదు ప్రతులను తెలంగాణ డీజీపీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మాదాపూర్ డీసీపీ, గచ్చిబౌలి ఏసీపీలకు సైతం పంపారు. ఐటీ కారిడార్‌లోని తమ ఉద్యోగులకు, నివాసితులకు రక్షణ కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదం.. నిందితులను అరెస్ట్ చేయొద్దన్న హైకోర్టు

- **ఎర్రవల్లి కేసులో నిందితుల అరెస్టుపై హైకోర్టు బ్రేక్**
- **నిందితులకు నోటీసులు ఇచ్చి దర్యాప్తు చేయాలని ఆదేశం**
- **ఏడేళ్లలోపు శిక్ష వర్తించే కేసులపై పోలీసులను నిలదీసిన కోర్టు**
- **సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించాలని స్పష్టీకరణ**
- **అరెస్టులపై పోలీసుల తీరును తప్పుబట్టిన హైకోర్టు**

ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయొద్దని ధర్మాసనం ఆదేశించింది. కేవలం నోటీసులు ఇచ్చి దర్యాప్తు కొనసాగించాలని పోలీసులకు



స్పష్టం చేసింది. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను ఎలా అరెస్టు చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని గుర్తుచేసింది. వాటిని పక్కనపెట్టి అరెస్టులకు ఎలా వెళతారని పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని హెచ్చరించింది. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ నిర్వహించిన నిరసన కార్యక్రమం తర్వాత ఈ వివాదం మొదలైంది. నిరసన జరిగిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు, స్థానికుల ఫిర్యాదులతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వారిలో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం.. నిందితుల అరెస్టుపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. తదుపరి చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని పోలీసులను ఆదేశించింది.



# ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు.. కాంగ్రెస్ ఓటమి ఖాయం: కవిత

- **ఉద్యోగులతో విభేదించిన ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి రాలేదని కవిత వ్యాఖ్య**
- **కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని విమర్శలు**
- **ఉద్యోగులు, ఉపాధ్యాయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణ**
- **630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలే ఉన్నారని విమర్శ**
- **పీఆర్సీ, డీఏలపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపణ**

ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని కవిత చెప్పారు. ఉద్యోగులను గౌరవించేలా, వారు సంతోషంగా పనిచేసేలా తమ ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం కన్నా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తు చేశారు. రాష్ట్రంలో 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది పర్మినెంట్ మండల విద్యాధికారులు (ఎంఈవోలు) ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందాలంటే బలమైన యంత్రాంగం అవసరమని అన్నారు.

# యూపీఐ చెల్లింపులకు ఛార్జీలు.. ట్రంప్‌ను బుజ్జగించేందుకేనా?: కాంగ్రెస్

రూ.2000 వరకు ఉండే యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు/పేమెంట్ సర్వీసు ప్రొవైడర్లు ఛార్జీలు వసూలు చేయరాదని కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ స్పందించింది. యూపీఐ చెల్లింపులకు ఛార్జీలు.. ట్రంప్‌ను బుజ్జగించేందుకేనా..? కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. రూ.2వేలు దాటిన యూపీఐ లావాదేవీలపై ఫీజులు విధించడానికి కేంద్రం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేసిందంటూ విమర్శించారు. "దేశంలో రూ.2వేలు దాటిన యూపీఐ లావాదేవీల సంఖ్య 5 శాతం మాత్రమే అయినప్పటికీ.. అవి మొత్తం విలువ పరంగా సుమారు 65 శాతం వాటాను కలిగి ఉన్నాయి. భారత్‌లోని జీరో ఎండీఆర్ పాలసీని అమెరికా పేమెంట్ కంపెనీలు ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నాయి. ఆ కంపెనీల ఆకాంక్షలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం విధానంలో మార్పు చేసుకుంటోంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో రాజీ పడిన ప్రధాని మోదీ.. మరోసారి అమెరికా ఒత్తిడికి లొంగిపోతున్నారు. ఆకాశాన్నంటుతున్న ద్రవ్యోల్బణం కారణంగా



సామాన్యుడి జేబులు ఇప్పటికే ఖాళీ అయ్యాయి. టోకు ద్రవ్యోల్బణం 10 శాతానికి చేరువలో ఉండగా.. 'డిజిటల్ చెల్లింపుల పన్ను' విధించడం ద్వారా ప్రజల మిగిలిన పొదుపును కూడా ప్రభుత్వం నాశనం చేయాలని ప్రణాళిక వేసింది. పదేళ్ల క్రితం పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ కొట్టింది. పెద్ద నోట్ల రద్దు వల్ల కలిగే వినాశకరమైన పరిణామాలపై ప్రశ్నలు తలెత్తినప్పుడు.. డిజిటల్ చెల్లింపులను, నగదు రహిత ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికే పెద్ద నోట్లు రద్దు చేశామని ప్రభుత్వం వాదించింది. రూ.5 వేల లావాదేవీలపై రూ. 25, రూ.10వేల లావాదేవీలపై రూ.50 వరకు పన్ను విధించే అవకాశం ఉందని నివేదికలు చెపుతున్నాయి.. ఇది నిజమేనా? ఎండీఆర్.. ద్వారా వ్యాపారులపై పడే అదనపు భారం చివరికి పెరిగిన ధరల రూపంలో సగటు వినియోగదారుడిపైనే పడుతుందని ప్రభుత్వం గ్రహించడం లేదా? ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం ప్రతిరోజూ వారి జేబులు ఖాళీ చేయడానికి కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తోంది" అని కాంగ్రెస్ నేతలు దుయ్యబట్టారు.

## వరదల వేళ.. బోటునే బడిగా మార్చి..

కటిహార్: బిహార్‌లో వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అనేక గ్రామాలు నీటమునిగాయి. భారీ వరదల నేపథ్యంలో విద్యార్థులు స్కూళ్లకు రావడం మానేశారు. దీంతో కటిహార్ జిల్లాలోని రఘునాథ్‌పుర్‌కు చెందిన ఉపాధ్యాయుడు మహమ్మద్ సాహెబ్ వినూత్న ఆలోచన చేశారు. ఓ బోటునే స్కూల్ గా మార్చేశారు. తల్లిదండ్రుల అనుమతితో వరద ప్రభావిత ప్రాంతాల విద్యార్థులను ప్రతిరోజూ నీటి మట్టం తక్కువ ఉన్న ప్రాంతానికి బోటులోనే తీసుకువెళ్లి, అందులోనే పాఠాలు చెబుతున్నారు. చదువు



పూర్తయిన అనంతరం మళ్లీ వారిని తిరిగి తమ ఇళ్ల వద్ద వదిలి వెళ్తున్నారు. రోజువారీ తరగతి పాఠాలతో పాటు మహమ్మద్ సాహెబ్ విద్యార్థులకు పడవలోనే వివిధ కోచింగ్ క్లాసులు కూడా నిర్వహిస్తుండటం విశేషం. మన చుట్టూ ఉన్న పరిస్థితులు చదువుకు ఆటంకం కలిగించొద్దనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఒకేసారి ఎక్కువ మంది విద్యార్థులు కాకుండా విడతల వారీగా బోటులో పాఠాలు బోధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## జెన్ జీ, జెన్ ఆల్ఫా చెప్పేది వినేందుకు మేం సిద్ధమే: నిర్మలా సీతారామన్

జెన్‌జీ, జెన్ ఆల్ఫా తరాలకు చెందిన యువత కూడా నాయకత్వ బాధ్యతలు స్వీకరించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆశయాలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని.. వారు ముందుకు రావాలని కోరారు. దేశం మనకు ఏం చేసిందని ప్రశ్నించకుండా.. మనం దేశం కోసం ఏం చేశామని ప్రశ్నించుకోవాలని సూచించారు. తమిళనాడు లోని డాక్టర్ ఎం.జి.ఆర్. ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. 'మిమ్మల్ని మీరు జెన్‌జీ, జెన్ ఆల్ఫా అని పిలుచుకున్నా సరే.. మీరు చెప్పేది వినడానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం. కానీ మీ చుట్టూ ఏం జరుగుతోంది? అందులో మీ పాత్ర ఏమిటి?, మీరు దేశం కోసం ఏం సాధించవచ్చు? అనే విషయాల గురించి తప్పక ఆలోచించాలి. దేశ ప్రయోజనాల విషయంలో ఎప్పుడూ రాజీ పడకూడదు. దేశం సురక్షితంగా, బలంగా ఉంటేనే మనం నివసించడానికి ఒక ఇల్లు ఉంటుంది. పలు ప్రపంచ దేశాల్లో




యుద్ధాలు, ఘర్షణల కారణంగా పౌరులు నిర్వాసితులుగా మారుతున్న పరిస్థితులను మనం చూస్తున్నాం. కానీ మనకు ఆ పరిస్థితి లేదు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం , పశ్చిమాసియాలో ఘర్షణలు వంటి అనిశ్చితుల వల్ల ప్రపంచ దేశాల్లో ముడి చమురు, గ్యాస్, ఎరువుల సరఫరా ప్రభావితం అవుతోంది. అయినప్పటికీ భారత్ అన్ని పరిస్థితులను ఎదుర్కొని.. 7.8 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. ప్రధాని మోదీ నేతృత్వంలోని బలమైన ప్రభుత్వమే ఈ స్థిరత్వానికి కారణం. యువత కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తోంది. జీవితంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా.. ధైర్యంగా ముందుకు సాగాలి. అప్పుడే అనుకున్నది సాధించగలం' అని నిర్మలా సీతారామన్ విద్యార్థులకు సూచించారు.

## ట్రంప్ మా హామీలను కాపీ చేస్తున్నారు

**: డీకే శివకుమార్**



కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను సమర్థిస్తూ కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ గ్యారంటీలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా కాపీ చేస్తున్నారని పేర్కొన్నారు. అవి బ్లాక్ బస్టర్ అయ్యాయంటూ మీడియాతో మాట్లాడారు. మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీని గెలిపిస్తే.. ప్రతి వయోజన అమెరికన్‌కు 5000 డాలర్లు ఇస్తామని ఇటీవల ట్రంప్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. "మా హామీలను మహారాష్ట్ర కాపీ చేసింది. రాజస్థాన్, బిహార్ అదే పనిచేశాయి. ఇప్పుడు ట్రంప్ మా బాటలోనే నడుస్తున్నారు. ఎన్నికల్లో గెలిస్తే 5వేల డాలర్లు ఇస్తానని ప్రకటించారు. మన ఆలోచనా విధానం భారత్‌కే పరిమితం కాకుండా ప్రపంచానికి పరిచయం అవుతోంది. ఇదే కాంగ్రెస్ పార్టీ బలం" అని శివకుమార్ పేర్కొన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని.. దేశం సాధించిన విజయాల్లో ప్రజలకు వాటా కల్పించడం కోసమే 5000 డాలర్లు ఇస్తామని ట్రంప్ చెప్పిన సంగతి తెలిసిందే. దానిని డివిడెండ్‌గా పేర్కొన్నారు. ఈ ఆకస్మిక వాగ్దానం అమలుకు లక్ష కోట్ల డాలర్లకు పైగా ఖర్చు కావచ్చని తెలుస్తోంది.

## ఆ కుటుంబంలో ఐదుగురు తోబుట్టువులకు.. నీట్‌లో సీట్లు

చదువుకోవాలనే తపన, సాధించాలనే సంకల్పం ఉండాలే గానీ.. ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని నిరూపించారీ తోబుట్టువులు. కడు పేదరికం, అరకొర వసతులు ఇబ్బంది పెట్టినా.. వాటిని దాటుకుని ప్రాణం పోసే వైద్య వృత్తి వైపు అడుగులు వేశారు. ఒకరి తర్వాత ఒకరు నీట్‌లో ఉత్తీర్ణత సాధించి వైద్య విద్యలో ప్రవేశం పొందారు. ఓ నిరుపేద ఆదివాసీ రైతు కుటుంబంలో పుట్టిన ఐదుగురు అన్నాచెల్లెళ్ల కథ ఇది..! ఒడిశా (Odisha)లోని కంధమాల్ జిల్లా సికాబడి గ్రామానికి చెందిన బృషినాయక్, అనుశాయ దంపతులది నిరుపేద కుటుంబం. ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తుంటారు. కొన్నిసార్లు కుటుంబాన్ని పోషించేందుకు బృషి నాయక్ వలసకూలీగా ఇతర రాష్ట్రాల్లో పనిచేశారు. అతడు చదువుకోలేదు, కానీ చదువు ఎంత ముఖ్యమో అర్థం చేసుకున్నారు. అందుకే, ఎంత కష్టమైనా సరే పిల్లలను చదివిస్తున్నారు. అన్న స్ఫూర్తితో..



తండ్రి బృషినాయక్ కష్టం చూసిన కుమారుడు బిబీశన్ మంచిగా చదువుకుని నీట్‌లో ఉత్తీర్ణత సాధించాడు. కొరాపుట్‌లోని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన అతడు.. ప్రస్తుతం అక్కడే ఇంటర్న్‌షిప్ చేస్తున్నాడు. బిబీశన్ స్ఫూర్తితో పెద్ద చెల్లెలు మోనాలిసా కూడా నీట్‌లో అర్హత సాధించి.. ఇదే మెడికల్ కాలేజీలో వైద్య విద్య రెండో సంవత్సరం చదువుతోంది. ఆ తర్వాత మరో ముగ్గురు చెల్లెల్లు సునేమీ, ఆశ్రియా, మీనాక్షి కూడా ఈ ఏడాది నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి.. ప్రభుత్వ రంగ వైద్య కళాశాలల్లో ప్రవేశం పొందారు. ఇందులో మీనాక్షి.. బృషి తమ్ముడు జిశియా కుమార్తె. కానీ కొన్ని కారణాల రీత్యా చిన్నతనం నుంచి ఆమెను బృషి దంపతులే పెంచుతున్నారు. "వీళ్లంతా నా పిల్లలే. మా ఇంట్లో మొత్తం 9 మంది ఉంటాం. మరో ఇద్దరు కుమారులు స్కూల్లో చదువుతున్నారు. మా పిల్లలు ఏం కోర్సులు చేస్తున్నారో నాకు తెలియదు. కానీ, వారంతా జీవితాల్లో స్థిరపడి సమాజానికి ఎంతో కొంత మేలు చేస్తే అంతకంటే ఆనందం ఏముంటుంది" అని వీరి తల్లి అనుశాయ ఆనందం వ్యక్తం చేశారు. తమ పిల్లల చదువుల కోసం ఇప్పటికే కొంత రుణం తీసుకున్నామని, అయితే వైద్య విద్య చాలా ఖర్చుతో కూడుకున్నది కావడంతో ప్రభుత్వం తమకు అండగా నిలవాలని బృషి నాయక్ కోరుతున్నారు.

## చిన్నారులపై లైంగిక వేధింపుల కంటెంట్ ఇస్తాం.. అంగీకరించిన మెటా

సామాజిక మాధ్యమాల్లో పిల్లల భద్రతకు సంబంధించిన అంశంలో ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా కీలక నిర్ణయం తీసుకుంది. చిన్నారులపై లైంగిక వేధింపుల కంటెంట్ కు సంబంధించి నేరుగా భారత దర్యాప్తు సంస్థలకు రిపోర్ట్ చేసేందుకు అంగీకరించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. ఆన్‌లైన్ వేదికల్లో పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోన్న కేంద్ర ప్రభుత్వం.. ఈ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. "చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కేసుల వివరాలు, ఇతరత్రా కంటెంట్‌ను దర్యాప్తు సంస్థలకు ఇచ్చేందుకు మెటా అంగీకరించింది. పిల్లలకు సురక్షితమైన ఆన్‌లైన్ వాతావరణాన్ని కల్పించే దిశగా ఇది తొలి అడుగు మాత్రమే. ఇంకా చేయాల్సింది చాలా ఉంది" అని కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఈ సందర్భంగా స్పష్టం చేశాయి. సామాజిక మాధ్యమాల్లో హానికర కంటెంట్ నుంచి మైనర్లను రక్షించాల్సిన బాధ్యత సదరు ప్లాట్‌ఫామ్‌లదే అని కేంద్రం పునరుద్ఘాటించింది. దీన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ హానికర కంటెంట్‌ను కట్టడి చేసే విషయమై సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లతో కేంద్రం నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. అలాంటి కంటెంట్‌ను గుర్తించి, సామాజిక మాధ్యమాల నుంచి తొలగించేలా చర్యలు చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇలాంటి కంటెంట్ విషయంలో భారత్‌లోని మెటా ప్రతినిధులకు కేంద్రం నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. మెటా ఉపయోగిస్తోన్న అల్గారిథమ్స్, కంటెంట్ నియంత్రణ వ్యవస్థలు, డీప్‌ఫేక్ కంటెంట్‌ను అరికట్టే ప్రక్రియలు, భారత చట్టాలకు అనుగుణంగా తీసుకుంటున్న చర్యల గురించి అధికారులు వివరాలు అడిగారు. ఈ నేపథ్యంలోనే మెటా తాజా నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటివరకు




చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ గురించి అమెరికాకు చెందిన 'నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్' (ఎన్‌సీఎంఈసీ)కు మెటా నివేదిక ఇచ్చేది. ఆ సమాచారాన్ని ఎన్‌సీఎంఈసీ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దర్యాప్తు సంస్థలతో పంచుకునేది. అలా భారత దర్యాప్తు సంస్థలకు వివరాలు అందేవి. అయితే, ఇకపై ఇలాంటి సంస్థల ప్రమేయం లేకుండా.. నేరుగా మెటానే భారత దర్యాప్తు ఏజెన్సీలకు వివరాలను రిపోర్ట్ చేయనుంది.

## కావాలనే కారుతో ఢీకొట్టాడు.. మహిళా బైకర్ ఆరోపణలు..!



గురుగ్రామ్‌లో మహిళా బైకర్ సియాను కారు ఢీకొట్టిన ఘటన తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. బైక్‌పై వెళ్తోన్న సియాను ఓ కారు వెంబడించి ఢీకొట్టిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. కారు నడిపిన కల్యాణ్ బైస్లా అనే వ్యక్తి తనపై వచ్చిన ఆరోపణలను ఖండించాడు. సియా బైక్‌పై గంటకు 140 నుంచి 170 కిలోమీటర్ల వేగంతో వెళ్తోందని.. తాను ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టలేదని చెప్పాడు. కేవలం సోషల్ మీడియాలో వ్యూస్, ఫాలోవర్లు, పబ్లిసిటీ కోసమే ఆమె ఈ ఘటనను పెద్దది చేస్తోందని వాదించాడు. ఈ వాదనను సియా తీవ్రంగా ఖండించింది. అనుకోకుండా ప్రమాదం జరిగితే.. కారు ఎందుకు ఆపలేదని కల్యాణ్ బైస్లాను ఆమె ప్రశ్నించారు. మహిళా బైకర్‌ను కావడంతో అతడు ఉద్దేశపూర్వకంగానే ఢీకొట్టాడని ఆరోపించారు. కారు ఢీకొట్టిన తర్వాత కనీసం తాను సురక్షితంగా ఉన్నానా లేదా అని చూసే ప్రయత్నం కూడా చేయలేదని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోల్లో తన బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోవడం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ఈ మేరకు సియా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పోస్టు చేశారు. నిందితుడు క్రిమినల్ మైండ్‌సెట్‌తోనే ఈ పని చేశాడని, మీడియా ముందు సాకులు చెప్తున్నాడని సియా కుటుంబసభ్యులు మండిపడ్డారు.

**నిందితుడి అరెస్టు...**

పరారీలో ఉన్న కల్యాణ్ బైస్లాను గురుగ్రామ్ పోలీసులు రాజస్థాన్‌లోని దౌసా లో అదుపులోకి తీసుకున్నారు. అతన్ని తదుపరి విచారణ కోసం గురుగ్రామ్‌కు తరలిస్తున్నారు. అతడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## తాలిబన్ల అదుపులో కేరళం వ్లాగర్.. ఆపై విడుదల

అఫ్గానిస్థాన్‌లో తాలిబన్లు తనను అదుపులోకి తీసుకున్నారని.. కొన్ని గంటల తర్వాత విడుదల చేశారని కేరళం రాష్ట్రానికి చెందిన మహిళా ట్రావెల్ వ్లాగర్ పేర్కొన్నారు. ప్రస్తుతం అఫ్గాన్‌లో పర్యటిస్తోన్న వ్లాగర్ అరుణిమ తాను తాలిబన్ల అదుపులో ఉన్నానని .. భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించడానికి సాయం చేయాలని కోరుతూ సోమవారం సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. అధికారిక అనుమతి పత్రం లేకపోవడంతో వారు తనను అదుపులోకి తీసుకున్నారన్నారు. మూడు గంటల తర్వాత.. తాలిబన్లు తనను వదిలేశారని పేర్కొన్నారు. "అఫ్గాన్ చట్టం ప్రకారం, ఒక మహిళ ఒంటరిగా ప్రయాణించకూడదు' అని బామియాన్‌లోని అధికారులు నాతో అన్నారు. మహిళలు ఒంటరిగా



ప్రయాణించడానికి అనుమతి లేని దేశానికి రావడమే నేను చేసిన నేరం. ఇక్కడ ప్రతి ప్రావిన్స్‌కు ఒక అనుమతి పత్రం చూపించాలి. గైడ్ కూడా లేకుండా నేను ఒక్కదాన్నే ప్రయాణిస్తున్నందున గతంలో జలాలాబాద్‌లో అధికారులు అనుమతి పత్రం ఇవ్వలేదు. అందువల్లే నా వద్ద ఆ పత్రాలు లేవు. ఇక్కడి నుంచి ప్రాణాలతో బయటపడతానని అనుకోలేదు. కాళ్లు పట్టుకొని బతిమాలితే కానీ వారు వినలేదు. దీంతో నేను బామియాన్‌కు చేరుకోవడానికి సాయం చేసిన వ్యక్తిని సంప్రదించాను. ఆ వ్యక్తి అధికారులతో మాట్లాడి, నచ్చజెప్పడంతో వారు నన్ను వదిలేశారు. కేవలం మహిళనైనందునే ఈ సమస్యలు ఎదురయ్యాయి. గతంలోనూ నా స్నేహితుల్లోని కొందరు యువకులు అఫ్గాన్‌కు వచ్చారు. వారెవరూ ఇటువంటి సమస్యలు ఎదుర్కోలేదు' అని ఆమె పేర్కొన్నారు.

## 'యూకే బ్రేకప్' కోసం సంతకాలు.. ఒంటరికానున్న ఇంగ్లాండ్..!

ప్రపంచవ్యాప్తంగా 60కిపైగా దేశాలను ఆక్రమించుకుని.. రవి అస్తమించని సామ్రాజ్యంగా ఒకప్పుడు వెలుగొందిన యునైటెడ్ కింగ్‌డమ్ ప్రభ మసకబారిపోతోంది. ఇప్పుడు యూకేలో భాగమైన దేశాలు కూడా బ్రేకప్ చెప్పాలని నిర్ణయించుకున్నాయి. ఆ మేరకు వేల్స్, స్కాట్‌లాండ్ , నార్తర్న్ ఐర్లాండ్ దేశాల ప్రతినిధులు తాజాగా సంతకాలు చేశారు. ప్రస్తుతం మనకు తెలిసిన బ్రిటన్,



యూకే పేర్లు కొన్ని దేశాల సమాహారంగా వచ్చాయి. ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్, వేల్స్ కలిసి గ్రేట్ బ్రిటన్. వీటికి నార్తర్న్ ఐర్లాండ్ కూడా కలిస్తే యునైటెడ్ కింగ్డమ్ . ఇప్పుడు ఈ యూకే నుంచి బయటపడి, పూర్తి స్వయం ప్రతిపత్తిగల దేశాలుగా ఉండాలని వేల్స్, స్కాట్‌లాండ్, నార్తర్న్ ఐర్లాండ్ కోరుకుంటున్నాయి. అదే జరిగితే ఆ రాజ్యంలో ఇంగ్లాండ్ ఒకటే మిగులుతుంది .రాజ్యాంగ మార్పునకు సిద్ధంగా ఉండాలని, తమ భవిష్యత్ ఐరోపా యూనియన్‌తో ముడిపడి ఉందని ఆ మూడు దేశాల ఫస్ట్ మినిస్టర్లు.. యూకే ప్రధాని ఆండీ బర్నహామ్ ప్రభుత్వానికి ఇప్పటికే తెలియజేశారు. వెస్ట్‌మినిస్టర్ (బ్రిటన్ పార్లమెంట్, ప్రభుత్వానికి కేంద్రస్థానం) సమయం ముగింపు దశకు వచ్చిందనడానికి ఇంతకు మించిన సంకేతం లేదని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఐర్లాండ్ పర్యటనలో భాగంగా రాజధాని నగరం డబ్లిన్‌లో మాట్లాడుతూ.. అవిభాజ్య ఐర్లాండ్‌ను చూడాలని అనుకుంటున్నట్లు చెప్పారు. అది ఎప్పటికైనా జరగాల్సిందే.. ఇప్పుడే జరిగితే మంచిదంటూ వివాదస్పద అంశాన్ని మరోసారి లేవనెత్తారు.




# టాటా గ్రూప్ స్టాక్స్ ర్యాలీ.. టాటా కెమికల్స్ ఏకంగా 20% జంప్

దిల్లీ: టాటా గ్రూపునకు చెందిన స్టాక్స్ మంగళవారం అనూహ్యంగా రాణించాయి. నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ లైసెన్సును వదులుకోవడానికి టాటా సన్స్ సమర్పించిన దరఖాస్తును ఆర్‌బీఐ తిరస్కరించిన సంగతి తెలిసిందే. దీంతో టాటా సన్స్‌కు లిస్టింగ్ తప్పనిసరి కానుంది. ఈ పరిణామంతో ఆయా కంపెనీల షేర్లు రాణించాయి. టాటా కెమికల్స్ ఏకంగా 20 శాతం లాభపడింది. ఎన్‌బీఎఫ్‌సీలకు సంబంధించి అప్పర్‌లేయర్ విభాగంలో టాటా సన్స్ ఉంది. ఈ విభాగంలోని ఎన్‌బీఎఫ్‌సీలు తప్పనిసరిగా స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదుకావాల్సి ఉంటుంది. ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్స్‌ను వదులుకోవడానికి చేసిన ప్రయత్నాలు విఫలం అవ్వడంతో టాటా సన్స్‌కు కూడా లిస్టింగ్ తప్పనిసరి కానుంది. ఇన్ఫర్మేషన్




టెక్నాలజీ, ఆటోమొబైల్, స్టీల్, కన్జూమర్ ప్రొడక్ట్స్, ఏవియేసన్, హాస్పిటాలిటీ, ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగాలకు చెందిన లిస్టెడ్, అన్‌లిస్టెడ్ కంపెనీల్లో టాటా సన్స్‌కు మెజారిటీ వాటా ఉంది. ఈ నేపథ్యంలో ఆయా లిస్టెడ్ కంపెనీల షేర్లు మంగళవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో రాణించాయి. టాటా కెమికల్స్ ఏకంగా 20 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. ఎన్ఎస్ఈలో ఒక్కరోజులోనే షేరు విలువ రూ.122 పెరిగి రూ.734.90కి చేరింది. టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఇంట్రాడేలో 15.24 శాతం మేర లాభపడింది. టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్స్ 5.89 శాతం, టీసీఎస్ 5.47 శాతం, టాటా ఎలెక్సీ 4.28 శాతం, టాటా పవర్ 3.41 శాతం, టాటా కమ్యూనికేషన్స్ అడ్వాన్స్డ్ 3.21 శాతం, టాటా స్టీల్ 1.96 శాతం, టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ 1.72 శాతం చొప్పున రాణించాయి. మార్కెట్ ముగిసే సమయానికి లాభాల స్వీకరణతో టాటా పవర్, టాటా కమ్యూనికేషన్స్, టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ స్వల్ప నష్టాల్లో ముగియగా.. మిగిలిన స్టాక్స్ లాభాలు కొంతమేర క్షీణించాయి.

### బిగ్ బ్యాటరీతో రెడ్‌మీ నుంచి

# 2 కొత్త స్మార్ట్‌ఫోన్లు.. ఫీచర్లివే!

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ రెడ్‌మీ తన నోట్ 17 సిరీస్ నుంచి రెండు కొత్త స్మార్ట్‌ఫోన్‌లను విడుదల చేసింది. రెడ్ నోట్ 17 ప్రో (Redmi Note 17 Pro), రెడ్‌మీ నోట్ 17ప్రో మ్యాక్స్ (Redmi Note 17 Pro Max) ను లాంచ్ చేసింది. 9000 ఎంఏహెచ్, 10000 ఎంఏహెచ్ బ్యాటరీలతో ఈ ఫోన్లను తీసుకొచ్చింది. ఎక్కువ రోజులు బ్యాటరీ లైఫ్ ఉండాలనుకునే వారికి ఇది బెస్ట్ ఆప్షన్‌గా మారనుంది. ఇక ఫోన్ల ఫీచర్లు పరిశీలిస్తే...

**రెడ్‌మీ నోట్ 17 ప్రో మ్యాక్స్**

* ఆండ్రాయిడ్ 16తో కూడిన హైపర్ ఓఎస్3పై పనిచేస్తుంది. స్నాప్‌డ్రాగన్ 6 జెన్ 5 ప్రాసెసర్ ఇచ్చారు. నాలుగేళ్లు పాటు ఓఎస్, ఆరేళ్లు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది. 6.83 అంగుళాల 1.5K అమోలెడ్ డిస్‌ప్లే, 120Hz రిఫ్రెష్ రేట్, 3,500 నిట్స్‌పీక్ బ్రైట్‌నెస్ ఇచ్చారు. HDR10+ డాల్బీ విజన్ సదుపాయం ఉంది. IP66+IP68+IP69K రేటింగ్ ఉంది.
* ఫోన్ వెనుక వైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా+8ఎంపీ అల్ట్రా వైడ్ కెమెరా ఇచ్చారు. ముందు వైపు 32 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంది. 10,000mAh బ్యాటరీ సదుపాయం, 100W వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్, 27W వైర్డ్ రివర్స్ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. 5G, 4G LTE, బ్లూటూత్ 6.0, USB TypeC పోర్టు కనెక్టివిటీ సదుపాయం ఉంది. 229 గ్రాములు.

**ధర విషయానికొస్తే..**

* బేస్ వేరియంట్ 8GB + 256GB ధర రూ.49,999, టాప్ వేరియంట్ ధర 12GB + 256GB ధర రూ.55,999. మాచా గ్రీన్, సీక్రెట్ సన్‌రైజ్, స్టెల్త్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. సెప్టెంబర్ 23 నుంచి అమెజాన్‌లో కొనుగోలు




చేయవచ్చు.

**రెడ్‌మీ నోట్ 17 ప్రో**

* ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 6s జెన్ 4 ప్రాసెసర్ ఇచ్చారు. ఆండ్రాయిడ్ 16తో కూడిన హైపర్ ఓఎస్3పై పనిచేస్తుంది. 6.83 అంగుళాల 1.5K అమోలెడ్ డిస్‌ప్లే, 120Hz రిఫ్రెష్ రేట్, 3,500 నిట్స్‌పీక్ బ్రైట్‌నెస్ ఇచ్చారు. IP66+IP68+IP69K రేటింగ్ ఉంది.
* ఫోన్ వెనుక వైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా+ 8ఎంపీ అల్ట్రా వైడ్ కెమెరా ఇచ్చారు. ముందు వైపు 16 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంది. రెడ్‌మీ నోట్ ప్రో 9,000mAh బ్యాటరీతో వస్తోంది. 67W వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్, 22.5W వైర్డ్ రివర్స్ ఛార్జింగ్ సదుపాయం ఉంది.

**ధర విషయానికొస్తే..**

* బేస్ వేరియంట్ 8GB+128GB ధర రూ.36,999, టాప్ వేరియంట్ 8GB+256GB ధర రూ.39,999గా కంపెనీ నిర్ణయించింది. సెప్టెంబర్ 17న అమెజాన్‌లో విక్రయానికి రానుంది. క్లౌడ్ బ్లూ, పర్పుల్ వైబ్, స్టెల్త్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. ఎస్‌బీఐ, యాక్సిస్‌బ్యాంక్, ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌కార్డులను ఉపయోగించి ఈ ఫోన్లను కొనుగోలు చేయడం ద్వారా రూ.5 వేల వరకు తక్షణ రాయితీ పొందొచ్చు. హెడీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌పై రూ.5 వేల వరకు క్యాష్‌బ్యాక్ అందిస్తామని కంపెనీ తెలిపింది.

# ప్రయాణికులకు ఎయిరిండియా గుడ్‌న్యూస్.. ఇకపై 4 గంటల్లోనే రిఫండ్

ప్రయాణికులకు ఎయిరిండియా గుడ్‌న్యూస్ చెప్పింది. వేగవంతమైన సేవలు అందించేందుకు ఏఐ టూల్స్ వినియోగిస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై రిఫండ్, టికెట్‌పై పేర్ల సవరణ వంటి సేవలు చకచకా జరగనున్నాయి. ఇందుకు సేల్స్‌ఫోర్స్ కంపెనీకి చెందిన ఏఐ ఏజెంట్‌ఫోర్స్ ప్లాట్‌ఫాంను నియమించుకుంది. దీంతో ఇంతకముందులా రిఫండ్ కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన ప్రయాస తప్పనుంది. ఎయిరిండియా తీసుకున్న తాజా నిర్ణయంతో.. రిఫండ్ సమయం 14 రోజుల నుంచి 4 గంటలకు తగ్గనుంది. అలాగే, టికెట్‌పై తప్పుగా నమోదైన ప్రయాణికుడి పేరును సవరించేందుకు గతంలో మూడు రోజులు పట్టేది. ఇప్పుడు 30 నిమిషాల్లోనే ఈ ప్రక్రియ పూర్తి కానుంది. ప్రయాణికులు ఒకే ఈమెయిల్‌లో పలు రకాల సమస్యలను ప్రస్తావించినా.. ఏఐ సిస్టమ్ వాటన్నింటినీ గుర్తించి ఒకే ఈమెయిల్‌లో సమాధానాన్ని పంపించనుంది.




**ముంబయిలో బోర్డు మీటింగ్..**

టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ అధ్యక్షతన ముంబయిలో జరిగిన బోర్డు సమావేశంలో కొత్త ఎండీ, సీఈఓ వేతనంతో పాటు ఇతర అంశాలపై చర్చించినట్లు సమాచారం. ప్రస్తుత సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ గ్రూప్ మాజీ చీఫ్ టెవోల్డే గెబ్రెమరియం బాధ్యతలు స్వీకరించనున్న విషయం తెలిసిందే.

**హోంమంత్రిత్వ శాఖ నోటీసులు**

సెప్టెంబర్ 4న దిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి ఇమిగ్రేషన్ తనిఖీలు లేకుండా ముగ్గురు ఇటాలియన్ పౌరులు దేశాన్ని వీడడాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీవ్రంగా పరిగణించింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఎయిరిండియా ఉన్నతాధికారులను ఆదేశించింది. కర్తవ్య భవన్‌లో సమావేశానికి హాజరు కావాలని తెలిపింది.

# కొత్త ఎగ్జిట్ రూల్స్ వేళ.. చైనాను వీడిన హువావే సీఈఓ..?

చైనాకు చెందిన అతిపెద్ద టెక్ కంపెనీల్లో ఒకటైన హువావే వ్యవస్థాపకుడు, కంపెనీ సీఈఓ రెన్ జెంగ్‌ఫీ దేశం దాటేశారా? టెక్నాలజీ కంపెనీలే లక్ష్యంగా అక్కడి ప్రభుత్వం తీసుకొస్తున్న నిబంధనల వేళ కుటుంబంతో కలిసి దేశాన్ని వీడారా? అంటే అవుననే అంటున్నాయి సోషల్‌మీడియా పోస్టులు. హువావేలో ప్రధాన కార్యాలయం వద్ద పోలీసుల మోహరింపు ఈ రూమర్లకు బలం చేకూరుస్తోందంటూ



పలు ఆంగ్లమీడియా కథనాలు పేర్కొంటున్నాయి. టెక్నాలజీ కంపెనీలను టార్గెట్ చేస్తూ విదేశీ ప్రయాణాలకు సంబంధించి చైనా కొత్త నిబంధనలు తీసుకొస్తోంది. ఈ నిబంధనల ప్రకారం.. జాతీయ లేదా సాంకేతిక భద్రతకు ముప్పుగా పరిగణించే చైనా పౌరులు దేశం విడిచి వెళ్లడంపై ఆంక్షలు ఉంటాయి. వారి ప్రయాణాలను అడ్డుకునేందుకు అక్కడి అధికారులకు ఈ నిబంధనలు అధికారమిస్తాయి. ఈ నిబంధనలు సెప్టెంబర్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో రెన్ జెంగ్‌ఫీ దేశం వీడారన్న రూమర్స్ వెలుగులోకి రావడం గమనార్హం.

# పాక్ క్రికెట్‌లో పెద్ద తలకాయలపై వేటు? ఈ సారైనా కలిసొస్తుందా?

దారుణ ఓటములతో పాకిస్థాన్ క్రికెట్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఇటీవల ఇంగ్లాండ్ గడ్డపై జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో కనీస పోటీ ఇవ్వలేక పాక్ వైట్‌వాష్‌కు గురైంది. ఈ సిరీస్‌లో రెండు మ్యాచ్‌ల్లో ఘోర ఓటమి తర్వాత హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌తోపాటు ఏడుగురు ఆటగాళ్లను తప్పించినా.. మూడో మ్యాచ్‌లోనూ పరాభవం తప్పలేదు. అంతేకాకుండా స్లో ఓవర్ రేట్ కారణంగా 11 పాయింట్ల కోత పడటంతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో పాక్ అట్టడుగుకు (తొమ్మిదో స్థానం) పడిపోయింది. ఈ పరిణామాలపై పీసీబీ చీఫ్ మోసిన్ నఖ్వీ గుర్రుగా ఉన్నట్లు సమాచారం. త్వరలో పీసీబీ (PCB)



లో భారీ ప్రక్షాళన చేపట్టి 'పెద్ద తలకాయల'పై వేటు వేసేందుకు నఖ్వీ మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. చీఫ్ సెలక్టర్ అకిబ్ జావేద్, మహిళల జట్టు హెడ్ కోచ్ వహాబ్ రియాజ్‌పై వేటుపడటం ఖాయంగా కనిపిస్తోంది. ఆసియా క్రీడల తర్వాత వీరిని తప్పించే అవకాముందని పీసీబీ వర్గాలు తెలిపాయి. కోచింగ్ స్టాఫ్‌ను కూడా సమూలంగా మార్చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గత రెండేళ్లుగా పీసీబీ తీసుకున్న అనేక కీలక నిర్ణయాల వెనుక అకిబ్ ప్రధాన సూత్రధారిగా ఉన్నాడు. తరచూ కెప్టెన్లను, కోచింగ్ సిబ్బందిని మారుస్తూ అతను తీసుకున్న నిర్ణయాలు బెడిసికొట్టాయి. దీంతో అతడిని పదవి నుంచి తప్పించాలనే ఆ దేశ మాజీలు డిమాండ్ చేశారు. జావేద్‌ను చీఫ్ సెలక్టర్‌గా నియమించడంతోనే పాక్ పతనం మొదలైందని, అతడు అక్కడ ఉన్నంత కాలం పాకిస్థాన్ క్రికెట్ వెనకడుగు వేస్తూనే ఉంటుందని పాక్ మాజీ టెస్టు కోచ్ జేసన్ గిలెస్పీ ఇటీవల వ్యాఖ్యానించాడు. పీసీబీలో మార్పులు చేయడం ఇదేం కొత్తకాదు. గతంలోనూ సెలక్షన్ కమిటీ, కెప్టెన్సీ, కోచింగ్ స్టాఫ్‌లో మార్పులు జరిగాయి. కానీ, జట్ల ఎంపికలో లోపాలు, పెద్ద తలకాయల జోక్యంతో టీమ్ ప్రదర్శన మరింత తీసికట్టుగా మారింది. కీలక బాధ్యతల్లో ఉన్న వ్యక్తులు తలదూర్చడంతో కోచ్‌లు స్వేచ్ఛగా వ్యవహరించలేకపోయారు. ఈసారి భారీ ప్రక్షాళన జరిగితే ఆ కొత్త మేనేజ్‌మెంట్‌లో ఎవరుంటారో చూడాలి. వారు తీసుకునే నిర్ణయాలు, వ్యవహరించే తీరుపై పాక్ టీమ్ ప్రదర్శన ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.






# గంభీర్ నిర్ణయంపై నా భార్య కూడా ఆశ్చర్యపోయింది: క్రిస్ శ్రీకాంత్

అఫ్గానిస్థాన్‌తో జరిగిన తొలి టీ20లో వైభవ్ సూర్యవంశీని తుది జట్టులోకి తీసుకోకపోవడంపై భారత మాజీ క్రికెటర్ క్రిస్ శ్రీకాంత్ టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్‌పై మండిపడ్డాడు. అంతేకాకుండా ఈ ఏడాది టీ20 ప్రపంచ కప్ సాధించడంలో కీలకపాత్ర పోషించిన సంజు శాంసన్ పట్ల యాజమాన్యం వ్యవహరిస్తోన్న తీరును కూడా ప్రశ్నించాడు. ఇటీవల జింబాబ్వేతో టీ20 సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన వైభవ్‌ను కాదని.. అఫ్గాన్‌తో తొలి టీ20లో సంజుకు అవకాశమిచ్చారు. అతను కేవలం 10 పరుగులే చేసి వెనుదిరిగాడు. "అఫ్గాన్‌తో తొలి టీ20లో వైభవ్ సూర్యవంశీ ఆడలేదు. దీంతో మేం మ్యాచ్ చూడటం ఆపేసి.. సినిమా చూడటం మొదలుపెట్టాం. సూర్యవంశీ ఎందుకు ఆడటం లేదని నా భార్య కూడా ఆశ్చర్యపోయింది. గత మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన వ్యక్తిని ఇప్పుడు ఎందుకు పక్కన పెట్టారని ప్రశ్నించింది. టీమ్‌మేనేజ్‌మెంట్ సూర్యవంశీ పట్ల సరిగ్గా వ్యవహరించడం లేదు. తర్వాత మ్యాచ్‌లో సూర్యవంశీ ఆడి.. పరుగులు చేయకపోతే తనను జట్టు నుంచి తొలగిస్తారేమోనని ఆందోళన చెందుతాడు. మీరు తప్పుడు సంకేతాలు పంపుతున్నారు. ఆటగాళ్లందరి మనసుల్లో సందేహాలు రేకెత్తిస్తున్నారు. సూర్యవంశీ దులీప్ ట్రోఫీ, టీ20లు, ఇండియా ఎ, ఐపీఎల్ వంటి అన్ని స్థాయుల్లోనూ పరుగులు సాధించాడు. మీరు అతడిని ప్రోత్సహించాలి" అని క్రిస్ పేర్కొన్నాడు.

*** టీమ్ మేనేజ్‌మెంట్ సంజుతో ఆడుకుంటోంది**

శాంసన్ విషయంలో జట్టు యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలను కూడా శ్రీకాంత్ విమర్శించాడు. "టీమ్ మేనేజ్‌మెంట్ సంజు శాంసన్‌తో ఆడుకుంటోంది. అతడిని చూస్తే జాలేస్తోంది. వైభవ్‌ను ఆడించాలని అతడిని తప్పించకండి. శాంసన్‌కు ఎక్కువ



అవకాశాలు ఇవ్వండి. రాణించకపోతే అప్పుడు తప్పించండి. వైభవ్ వరుసగా కొన్ని మ్యాచ్‌లు ఆడేలా చూడండి. వీరిద్దరిలో ఎవరినీ స్థిరంగా తుది జట్టులో ఉంచకపోవడం భారత్ చేస్తోన్న పొరపాటు. ఇది ఏ ఆటగాడికైనా ఇబ్బందికరమే" అని క్రిస్ శ్రీకాంత్ వివరించాడు.

### ఐసీసీ ర్యాంకింగ్స్..

# తొలి భారత ప్లేయర్‌గా శ్రీ చరణి రికార్డు

మహిళల ఆసియా కప్‌లో అదరగొట్టిన భారత అమ్మాయిలు ఈ వారం తమ ఐసీసీ ర్యాంకింగ్స్‌ను గణనీయంగా మెరుగుపర్చుకున్నారు. శ్రీలంకతో జరిగిన ఫైనల్లో నాలుగు వికెట్లు పడగొట్టిన తెలుగమ్మాయి శ్రీ చరణి అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. ఈ స్పిన్నర్ తన కెరీర్‌లోనే తొలిసారి 800 రేటింగ్ పాయింట్ల మార్క్‌ను దాటి 804 పాయింట్లతో ఉంది. మిథాలీరాజ్ (780.. 2011లో)ను అధిగమించి బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో 800 పాయింట్స్ సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్‌గా శ్రీ చరణి చరిత్ర సృష్టించింది. అంతేకాదు టీ20ల్లో బౌలింగ్ విభాగంలో ఆల్‌టైమ్ అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు సాధించిన క్రికెటర్లలో శ్రీ చరణి రెండో స్థానానికి చేరుకుంది. మరో మూడు పాయింట్లు సాధిస్తే ఆస్ట్రేలియా క్రికెటర్ మేగన్ షట్ (806.. 2001లో)ను అధిగమించి కొత్త రికార్డు నెలకొల్పే అవకాశం ఉంటుంది.

**రెండో స్థానానికి దీప్తి శర్మ**

ఈ ఆసియా కప్‌లో 14 వికెట్లు పడగొట్టి టాప్ వికెట్ టేకర్‌గా నిలిచిన దీప్తి శర్మ (729 పాయింట్లు) నాలుగు స్థానాలు ఎగబాకి రెండో స్థానానికి దూసుకొచ్చింది. 236 రన్స్‌తో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచిన షెఫాలి వర్మ ఒక స్థానం మెరుగై ఆరో ర్యాంకు దక్కించుకుంది. స్మృతి మంధాన 5వ, హర్మన్‌ప్రీత్ కౌర్ 10వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలో షెఫాలి (221 పాయింట్లు) ఐదు స్థానాలు ఎగబాకి కెరీర్‌లో బెస్ట్ రేటింగ్ పాయింట్స్ సాధించింది.



# 'ఇమ్రాన్ జైలులోనే చనిపోతారేమో'.. జోక్యం చేసుకోండి: ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ల లేఖ

పాక్ మాజీ ప్రధాని, ఆ దేశ క్రికెట్ మాజీ సారథి ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై గ్రెగ్ చాపెల్, స్టీవ్ వా సహా పలువురు ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇమ్రాన్ జైలులోనే చనిపోతారేమోనని తమకు ఆందోళనగా ఉందని చాపెల్ అన్నాడు. రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్‌కు మానవతా దృక్పథంతో మెరుగైన చికిత్స అందించేలా జోక్యం చేసుకోవాలని ఏడుగురు ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్లు తమ ప్రభుత్వానికి లేఖ రాశారు. దౌత్యపరంగా జోక్యం చేసుకోవాలని కోరుతూ ఈ మాజీలు మంగళవారం ఆస్ట్రేలియా విదేశాంగశాఖ మంత్రి పెన్నీ వాంగ్ కు లేఖ రాశారు. అలెన్ బోర్డర్, గ్రెగ్ చాపెల్, ఇయాన్ చాపెల్ , బెలిండా క్లార్క్, కిమ్ హ్యూస్, మార్క్ టేలర్, స్టీవ్ వా సంతకాలతో కూడిన లేఖను పంపారు. ఇమ్రాన్ ఖాన్‌పై ఉన్న చట్టపరమైన లేదా రాజకీయ సంబంధిత కేసుపై తాము ఎలాంటి వైఖరిని తీసుకోబోమని ఏడుగురు కెప్టెన్ల బృందం ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, రాజకీయాలను పక్కనపెట్టి ఇమ్రాన్ ఖాన్‌కు మెరుగైన చికిత్స అందించాలని మాజీ కెప్టెన్లు కోరారు.



## తల్లైన తర్వాత తొలిసారిగా

గత ఏడాది నవంబర్‌లో తల్లిగా మారింది బాలీవుడ్ హీరోయిన్ కత్రినాకైఫ్. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ఇంటికే పరిమితమైంది. సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా లేదు. ఏ ఈవెంట్‌లలో కనిపించలేదు. దాదాపు పది నెలల విరామం తర్వాత తొలిసారిగా పారిశ్రామిక వేత్త ముఖేష్ అంబానీ ఇంట వినాయ కచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. బాలీవుడ్ సినీ, క్రీడా ప్రముఖులతో అంబానీ ఇల్లు కళకళ లాడింది. ఈ వేడుకల్లో భర్త విక్కీ కౌశల్‌తో కలిసి కత్రినా కైఫ్ పాల్గొన్నది. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడు తోన్నాయి. వీటిలో కత్రినాకైఫ్‌గు ర్తుపట్టలేని విధంగా మారిపో యింది. ఒకప్పుడు బాలీవుడ్‌లో మోస్ట్ గ్లామరస్ బ్యూటీగా పేరు తెచ్చుకున్న కత్రినా కైఫ్ ఇంతలా మారిపోయిందేంటి అంటూ కామెంట్లు పెడుతోన్నారు.

## సమంతకు సీమంతం

టాలీవుడ్ హీరోయిన్ సమంత త్వరలో మాతృత్వపు బంధంలోకి అడుగుపెట్ట బోతుంది. ప్రెగ్నెంట్‌గా ఉన్న సమంతకు సీమంతం జరిగింది. శ్రీవిద్య సంప్రదా యానికి చెందిన కళావరణం (శ్రీకల్పం) అనే విధానంలో ఈ వేడుకలు జరిగిన ట్లు సమంత ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ పెట్టింది. ఈ సీమంతం వేడుకల్లో సమంత భర్త రాజ్ నిడిమోరు, స్టైలిష్ట్ నీరజ కోన, డిజైనర్ శిల్పారెడ్డితో పాటు కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు. ఈ సీమంతం వేడుకల తాలూకు ఫొటోలు, వీడియోలను సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. కళావరణం విధానా-న్ని గురించి ఈ పోస్ట్‌లో వివరించింది. మన సంప్రదాయాలను నేను గౌరవిస్తా. ప్రతి ఆచారం వెనుక ఏదో బలమైన శక్తి ఉందని నమ్ముతా. కళావరణంలో శ్రీవి ద్య ఉపాసకుల ప్రత్యేక మంత్రోచ్ఛారణ లు చేస్తూ, పవిత్ర జలాలతో గర్భిణికి అభిషేకం చేస్తారని తెలిపింది.



Cinema




## నాలుగోసారి జోడీగా..?

భారతరత్న అవార్డు గ్రహీత, దిగ్గజ సంగీత కళాకారిణి ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవితం ఆధారంగా తెలుగులో ఓ మూవీ రాబోతుంది. ఈ బయోపిక్‌ను మేకర్స్ మంగళవారం అధి కారికంగా ప్రకటించారు. సుబ్బులక్ష్మి 101వ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 16 బుధవారం చెన్నైలో ఈ బయోపిక్ లాంఛ్ కాబోతుంది. ఈ బయోపిక్‌లో రష్మిక మందన్న హీరోయిన్‌గా నటించబోతున్నట్లు వెల్లడించారు. సుబ్బులక్ష్మిగా రష్మిక నటించనుందని పేర్కొన్నారు. ఈ పాత్ర పేరు ఆధారంగానే ఈ సినిమాకు సుబ్బులక్ష్మి అమ్మ అనే టైటిల్ ఖరారు చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఈ సినిమాలో రష్మికకు జోడీగా విజయ్ దేవరకొండ, దుల్కర్ సాల్మన్ పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## కమల రెడ్డిగా శివగామి

బాహుబలిలో పవర్‌ఫుల్ పాత్రతో ప్రేక్షకులను మెప్పించిన సీనియర్ హీరోయిన్ రమ్యకృష్ణ కొంత గ్యాప్ తర్వాత మరో డిఫరెంట్ రోల్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మంచు మనోజ్ హీరోగా డేవిడ్ రెడ్డి పేరుతో తెర కెక్కుతున్న పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీకి హనుమ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. బ్రిటీషర్లను ఎదురించి పోరాడిన ఓ వీరుడి కథతో రాబోతు న్న సినిమాలో రమ్యకృష్ణ ఓ కీలక పాత్రలో కనిపించబోతుంది. కమల రెడ్డి అనే పాత్రలో ఆమె నటిస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. రమ్యకృష్ణ బర్త్‌డే సందర్భంగా ఓ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో చేతిలో కత్తితో సింహాసనం లాంటి పెద్ద కుర్చీలో కూర్చొని రమ్యకృష్ణ కనిపిస్తోంది.



## బాలీవుడ్ సినిమాకు రైటర్‌గా



టాలీవుడ్ హీరోయిన్ దిగంగనా సూర్యవన్షీ రచ యితగా మారింది. బాలీవుడ్ సినిమాకు స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించబోతుంది. కార్తికేయ హీరోగా నటించిన హిప్పీ మూవీతో తెలుగు ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత వలయం, సీటీమార్, క్రేజీ ఫెల్లో, శివంభజే సినిమాల్లో హీరోయిన్‌గా నటించింది. వీటిలో గ్లామ ర్‌తో ఆకట్టుకుంది ఈ బ్యూటీ. హీరోయి న్‌గా అంతగా సక్సెస్ కాలేకపోయిన ఈ బ్యూటీ కొత్త జర్నీ మొదలుపెట్ట బోతుంది. బాలీవుడ్ స్టార్ కొరియో గ్రాఫర్ గణేష్ ఆచార్య దర్శకత్వం లో గణేష్ డస్ట్ టూ స్టార్‌డస్ట్ పేరుతో తెరకెక్కుతోన్న మూవీకి దిగంగనా సూర్యవన్షీ స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందిం చబోతుంది. రైటర్‌గా ఈ సినిమా తోనే ఎంట్రీ ఇవ్వబోతుంది. కథానా యికగా అంతగా అవకాశాలు రా కపోవడంతోనే ఈ బ్యూటీ రైటర్‌గా మారినట్లు ప్రచారం జరుగుతోంది. సినిమాల్లోకి రాకముందు వేవ్స్, నిక్సెన్ ది మెర్మెడ్ అండ్ ది పవర్ ఆఫ్ లవ్ అనే బుక్స్ రాసింది. బిగ్‌బాస్ హిందీ సీజన్ 9లో ఓ కంటెస్టెంట్‌గా పాల్గొన్నది. శకుంతల, కృష్ణ అర్జున్, ఎక్ వీర్ కీ అర్దాస్ వీర అనే సీరియల్స్‌లో నటించింది.